గౌతమ్ న్యూస్ తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సీ ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.


# గౌతమ్ న్యూస్

తెలుగు దిన పత్రిక


ప్రతి క్షణం ప్రజల కోసం...
24 X 7
GAUTHAM NEWS
Voice of Truth...
GAUTHAM NEWS TV



హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 128, ఎడిటర్,భీముడు నాయక్ పేజిలు : 12, వెల రూ. 1, గురువారం - 13- జూన్ - 2024

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## వయనాడ్ లేదా రాయ్‌బరేలీ... తేల్చుకోలేకపోతున్నా




బుధవారం మలప్పురంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న రాహుల్ గాంధీ

ఒక నియోజక వర్గానికే ఎంపీగా ఉండాల్సి ఉంటుందని వ్యాఖ్య

తన నిర్ణయంతో రెండు నియోజకవర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్న రాహుల్

## ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నిర్మల సీతారామన్



2లో

మోదీ 2.0లో ఆర్థిక - కార్పొరేట్ వ్యవహారాల మంత్రిగా నిర్మల సీతారామన్

మోదీ 3.0 హయాంలోనూ అదే పోర్ట్‌ఫోలియో

బుధవారం ఉదయం ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నిర్మలమ్మ

ఇప్పుడు ఆర్థిక మంత్రిపై కొత్త ప్రభుత్వంలో మొదటి బడ్జెట్‌ను రూపొందించే బృహత్తర బాధ్యత

## కువైట్‌లో ఘోర అగ్నిప్రమాదం..

41 మంది సజీవదహనం..



- మృతుల్లో ఐదుగురు భారతీయులు!
- దక్షిణ మంగాఫ్ జిల్లాలో ఘటన
- 195 మంది కార్మికులు నివాసం ఉంటున్న భవనంలో చెలరేగిన మంటలు
- కార్మికుల్లో కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వారే అత్యధికులు
- భవనం మలయాళీ వ్యాపారవేత్త కెజి అబ్రహంకు చెందినదిగా అధికారుల వెల్లడి
- ఘటనపై కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం విచారం

## ముఖ్యమంత్రిగా 4వ సారి ప్రమాణస్వీకారం

# నారా చంద్రబాబు నాయుడు అనే నేను



- చంద్రబాబుతో ప్రమాణం చేయించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- చంద్రబాబును హత్తుకుని అభినందించిన ప్రధాని మోదీ

వివరాలు 2లో..

అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు ఏపీ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ అబ్దుల్ నజీర్... చంద్రబాబుతో ప్రమాణ స్వీకారం చేయించారు. నారా చంద్రబాబు నాయుడు అనే... అంటూ బాబు ప్రమాణం కొనసాగింది. శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంతఃకరణ శుద్ధితో నిర్వహిస్తానని, భయం కానీ, పక్షపాతం కానీ, రాగద్వేషాలు కానీ లేకుండా... రాజ్యాంగాన్ని, శాసనాలను అనుసరించి

## ప్రమాణ స్వీకారం చేసిన ఏపీ మంత్రులు వీరే...!



ఏపీలో నూతన ప్రభుత్వం కొలువుదీరింది. ఎన్నికల్లో 164 స్థానాలతో ప్రభంజనం సృష్టించిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి... వైసీపీని 11 సీట్లకే పరిమితం చేసింది. ఇవాళ చంద్రబాబు ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం... ఆయన మంత్రివర్గ సహచరులు 24 మంది ప్రమాణం చేశారు. టీడీపీ నుంచి నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, పొంగూరి నారాయణ, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, ఫరూక్, ఆనం రామనారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, డోలా బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, గుమ్మడి సంధ్యారాణి, బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, ఎస్.సవిత, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. జనసేన నుంచి పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్ ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీ నుంచి సత్యకుమార్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, ఈ క్యాబినెట్ లో 17 మంది కొత్తవారే ఉన్నారు. అందులో ముగ్గురు మహిళలు. 8 మంది బీసీలు, ఇద్దరు ఎస్సీలు, ఒక ఎస్టీ, ఒక వైశ్య సామాజికవర్గ నేతకు క్యాబినెట్ లో అవకాశం కల్పించారు.

"కొణిదెల పవన్ కల్యాణ్ అనే నేను శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, భారత దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని, ఆంధ్రప్రదేశ్ మంత్రిగా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంత:కరణశుద్ధితో నిర్వహిస్తానని ప్రమాణం చేస్తున్నాను" అంటూ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రమాణం చేశారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ కేసరపల్లి సభావేదికపై పవన్ తో ప్రమాణం చేయించారు. కొణిదెల పవన్ కల్యాణ్ అనే నేను.. అంటూ పవన్ పలకగానే ఆయన అభిమానులు, జనసేన కార్యకర్తల సంతోషం మిన్నంటింది. చప్పట్లు, కేకలతో సభా ప్రాంగణం మార్మోగింది. పవన్ ప్రమాణస్వీకారం చేస్తుండగా ఆయన భార్య అన్నా లెజనోవా, సోదరుడు చిరంజీవి ముఖాల్లో సంతోషం వెల్లివిరిసింది. ప్రమాణం పూర్తయ్యాక వేదికపై ఉన్న చంద్రబాబు దగ్గరికి వెళ్లిన పవన్ కల్యాణ్ ఆయనతో కరచాలనం చేశారు. ఈ సందర్భంగా పవన్ ను చంద్రబాబు అభినందించారు. ఆపై వేదికపై ఉన్న గవర్నర్, ఇతర ప్రముఖులకు ఆంధ్రప్రదేశ్ మంత్రి పవన్ కల్యాణ్ నమస్కరించారు. అన్న చిరంజీవికి పాదాభివందనం చేసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.



## పవన్ కల్యాణ్ అనే నేను..

## లోక్ సభ స్పీకర్ గా దగ్గుపాటి పురంధేశ్వరి? .. వ్యూహాత్మకంగా బీజేపీ అడుగులు



2లో

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ కేబినెట్ పై స్పష్టత వచ్చిన నేపథ్యంలో, ఇప్పుడు కీలకమైన లోక్ సభ స్పీకర్ పదవి ఎవరికి దక్కనుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఎన్డీయేలో కీలక మిత్రపక్షాలుగా ఉన్న టీడీపీ, జేడీయూలు ఈ పదవిని కోరుతున్న నేపథ్యంలో, బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.ఇప్పుడు మోదీ 3.0 ప్రభుత్వంలో మిగతా..2లో

## ఉల్లి ధరల దడ.. సామాన్యుల బెంబేలు..!!



మహారాష్ట్ర : ఉల్లి ధరల మంట సామాన్యులకు దడ పుట్టిస్తోంది. మే 25న కిలో ఉల్లి ధర రూ. 17 ఉండగా.. ఇప్పుడు దాదాపు 30 శాతం నుంచి 50 శాతం మేర పెరిగిపోయింది. గత 17 రోజుల వ్యవధిలో ఉల్లి ధర అమాంతం పెరిగింది. తెలుగు రాష్ట్రాల్లో హెూల్‌సేల్ మార్కెట్లో కిలో ఉల్లి ధర రూ. 33కు చేరింది. ఇక రిటైల్ మార్కెట్లో రూ. 40 నుంచి రూ. 50 దాకా పలుకుతోంది. దేశంలోనే ఉల్లి అత్యధికంగా లభ్యమయ్యే మహారాష్ట్రలోని నాసిక్‌లో ఉన్న లాసల్‌గావ్ మండిలో కిలో ఉల్లిగడ్డ హెూల్‌సేల్ ధర రూ.30 ఉంది. కిలో ఉల్లి ధర చెన్నైలో గరిష్టంగా రూ.50 నుంచి రూ.70 దాకా పలుకుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఉల్లి ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.మహారాష్ట్ర నుంచి దక్షిణాది రాష్ట్రాలకు నిత్యం మిగతా..2లో


# మంత్రుల ఫార్ములా ఇదేనా?



## కూటమి పార్టీలకు మంత్రి పదవులు సర్దుబాటు

అమరావతి: రాష్ట్రంలో టీడీపీ కూటమి అఖండ విజయం సాధించింది. బుధవారం ఉదయం 11:27 గంటలకు టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అలాగే మంత్రి వర్గ సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అయితే టీడీపీ కూటమి భాగస్వామ్య పార్టీలకు మంత్రి పదవుల పంపకం కూడా చివరి దశకు చేరుకుంది. మొత్తం 25 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. అందులో మిగతా..2లో

# మలుపులు..గెలుపులు..



2లో

## ప్రాంతీయ పార్టీల 'జాతీయ' బంధాలు..

హైదరాబాద్: దేశంలో ప్రాంతీయ పార్టీలు ఏదో ఒక జాతీయ కూటమిలో భాగస్వామి అయితేనే ప్రయోజనమా అనే చర్చ జరుగుతోంది. కొన్ని ప్రాంతీయ పార్టీలు తమ విధానాలు, తమ సిద్ధాంతాలు, తమ వెనుక ఉండే ఓట్ బ్యాంక్ ఆధారంగా జాతీయ పార్టీల కూటమిలో కలవాలా? వద్దా? అనే నిర్ణయాలు తీసుకుంటున్నాయి. కొన్ని పార్టీలు పూర్తి అవకాశవాదంతో ఎటు వెళితే ఉపయోగమని అనుకుంటాయో అటు వెళుతున్నాయి. కేంద్రంలో ఉన్న ప్రభుత్వాలు ఒకప్పుడు రాష్ట్రాలలోని రాజకీయాలలో అంతగా

## ఏపీని నవశకం దిశగా నడిపించేందుకు సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాం



2లో

గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక



# వయనాడ్ లేదా రాయ్‌బరేలీ... తేల్చుకోలేకపోతున్నా

ఢిల్లీ: వయనాడ్, రాయ్‌బరేలీలలో ఏ నియోజకవర్గంలో కొనసాగాలనేది తేల్చుకోలేకపోతున్నానని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. కేరళలోని మలప్పురంలో బుధవారం జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ... ఈ విషయంలో తానూ ఏమీ తేల్చుకోలేకపోతున్నానన్నారు. ఏమైనా తాను ఏదో ఒక నియోజకవర్గానికి మాత్రమే ఎంపీగా ఉండాల్సి ఉంటుందన్నారు. తన నిర్ణయంతో రెండు నియోజకవర్గాలు సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. తనను భారీ మెజార్టీతో గెలిపించిన వయనాడ్ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ప్రధాని మోదీపై విమర్శలు

దేశంలో విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు అదానీకి అప్పగించాలని దేవుడు ఆదేశించారా? అని ఎద్దేవా చేశారు. తాను మానవమాత్రుడినేనని... తనకు పేదలు, దేశమే దైవమన్నారు. నేనేం చేయాలో వారే చెబుతారన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత మోదీ తన వైఖరిని మార్చుకోవాల్సిందే అన్నారు. ఆయనకు ప్రజలు స్పష్టమైన సందేశం ఇచ్చారని మెజార్టీ రాకపోవడాన్ని ఉద్దేశించి అన్నారు.

# ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నిర్మల సీతారామన్

ఢిల్లీ: మోదీ 3.0 ప్రభుత్వంలో కీలక శాఖలైన రక్షణ, హెూమ్, ఆర్థిక, విదేశీ వ్యవహారాల శాఖలు బీజేపీ చేతిలోనే ఉన్నాయి. ఈ శాఖలను పాత మంత్రులకే ప్రధాని మోదీ అప్పగించడం జరిగింది. మోదీ 2.0లో ఆర్థిక %఑% కార్పొరేట్ వ్యవహారాల మంత్రిగా పని చేసిన నిర్మల సీతారామన్‌కు మోదీ 3.0 హయాంలోనూ అదే పోర్ట్‌ఫోలియో దక్కింది. దీంతో ఆమె బుధవారం ఉదయం ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఇక తన ఆఫీస్ కు వచ్చిన నిర్మలమ్మను అక్కడి సిబ్బంది పూల బొకేలతో స్వాగతించారు. అనంతరం ఆమె నార్త్ బ్లాక్‌లో ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇక బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశం కానున్నారు. కొత్త ప్రభుత్వంలో మొదటి బడ్జెట్‌ను రూపొందించే బృహత్తర బాధ్యత ఇప్పుడు ఆర్థిక మంత్రిపై ఉంది. మోదీ 3.0 తొలి బడ్జెట్‌ను జులై మొదటి లేదా రెండో వారంలో ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. కాగా, 'భారతదేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తాం, ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మలుస్తాం' అంటూ బీజేపీ 2.0 ప్రభుత్వంలో చాలాసార్లు చెప్పారు. ఇప్పుడు, ప్రధాని నరేంద్ర మోదీ తన మూడో టర్మ్‌లో దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చి భారతదేశాన్ని 5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చే బాధ్యతను నిర్మల సీతారామన్‌కు అప్పగించారు.

# కువైట్‌లో ఘోర అగ్నిప్రమాదం..

## 41 మంది సజీవదహనం..

కువైట్: గల్ఫ్ దేశం కువైట్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 41 మంది మృతి చెందారు. మరో 50 మందికి పైగా గాయాలైనట్లు సమాచారం. మృతుల్లో ఐదుగురు భారతీయులు కూడా ఉన్నట్లు తెలిసింది. వారందరూ కేరళ రాష్ట్రానికి చెందిన వారని తెలుస్తోంది. దక్షిణ మంగాఫ్ జిల్లాలో బుధవారం ఉదయం ఈ ఘటన జరిగింది. ఓ భవనంలో మంటలు చెలరేగడం వల్ల భారీ స్థాయిలో ప్రాణనష్టం సంభవించినట్లు అధికారులు తెలిపారు. ఈ భవనంలో 195 మంది కార్మికులు నివాసం ఉండగా, వారిలో కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉన్నారు. అలాగే ఈ భవనం మలయాళీ వ్యాపారవేత్త కెజి అబ్రహంకు చెందినదిగా అధికారులు తెలిపారు. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని పేర్కొన్నారు. ప్రమాద కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఇక ఈ ఘటనపై కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం విచారం వ్యక్తం చేసింది. "ఈరోజు భారతీయ కార్మికులకు సంబంధించిన విషాదకరమైన అగ్నిప్రమాదానికి సంబంధించి ఎంబసీ అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్: 965-65505246ను ఏర్పాటు చేయడం జరిగింది. అప్‌డేట్‌ల కోసం బాధితులందరూ ఈ హెల్ప్‌లైన్‌లో కనెక్ట్ అవ్వాలని అభ్యర్థిస్తున్నాం. సాధ్యమైన సహాయాన్ని అందించడానికి ఎంబసీ కట్టుబడి ఉంది" అంటూ భారత ఎంబసీ 'ఎక్స్' (ట్విట్టర్ ) లో ఒక పోస్ట్ చేసింది. ఈ ఘటనపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, భారత రాయబారి ఘటనా స్థలికి వెళ్లినట్లు తెలిపారు. "కువైట్ నగరంలో అగ్నిప్రమాద ఘటన వార్తతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. 40 మందికి పైగా మరణించారని, 50 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారని సమాచారం. మా రాయబారి ఘటనా స్థలికి వెళ్ళారు. తదుపరి సమాచారం కోసం మేము ఎదురుచూస్తున్నాము. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా మరియు పూర్తిగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. ఈ విషయంలో సంబంధిత అందరికీ మా ఎంబసీ పూర్తి సహాయాన్ని అందజేస్తుంది" అని జైశంకర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# ఏపీని నవశకం దిశగా నడిపించేందుకు సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాం

అమరావతి: అసెంబ్లీ ఎన్నికల్లో జయభేరి మోగించిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నేడు లాంఛనంగా కొలువుదీరింది. ఇవాళ గన్నవరం వద్ద జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా... పవన్ కల్యాణ్, నారా లోకేశ్ సహా 24 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరై ఏపీ నూతన ప్రభుత్వానికి ఆశీస్సులు అందజేశారు. అనంతరం మోదీ సోషల్ మీడియాలో స్పందించారు. "ఏపీలో కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకార వేడుకకు హాజరయ్యాను. ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబుకు, మంత్రులుగా ప్రమాణం చేసిన ఇతరులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఏపీకి ఉజ్వలమైన భవిష్యత్తును అందించేందుకు, మరింత అభివృద్ధి దిశగా నడిపించేందుకు, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం సంపూర్ణంగా కట్టుబడి ఉంది. యువత ఆశలను ఈ ప్రభుత్వం నెరవేర్చుతుంది" అని స్పష్టం చేశారు.

# ఉల్లి ధరల దడ.. సామాన్యుల బెంబేలు..!!


మొదటి పేజి తరువాయి

పెద్దఎత్తున ఉల్లిపాయల ఎగుమతి జరుగుతుంటుంది. ఎగుమతి సుంకం రేట్లు పెరగడం వల్ల కూడా ఉల్లిరేట్లు పెరిగాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం రబీ సీజన్‌లో ఉల్లి సాగు తగ్గిపోవడంతో మార్కెట్లో వాటి లభ్యత డౌన్ అయిందని అంటున్నాయి. అందుకే రేట్లు పెరిగాయని పేర్కొంటున్నారు.రాబోయే వారం రోజుల్లో ఉల్లి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. మరోవైపు కూరగాయల ధరలు సైతం రెట్టింపయ్యాయి. రూ.20 ఉండే కిలో వంకాయలు రూ.40కి చేరగా, బెండకాయలు రూ.24 నుంచి రూ.40కి చేరాయి. బీరకాయలు రూ.30 నుంచి రూ.50కి పెరిగాయి. కిలో టమాటా రేటు రూ.20 నుంచి రూ.50కి పెరిగింది. పప్పు, ఉప్పు వంటి నిత్యావసర వస్తువుల ధరలు సైతం సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఉల్లి ధర ఇప్పుడు కన్నీళ్లు తెప్పిస్తోంది. వారం రోజుల్లో దాదాపు రెట్టింపు ఖరీదు అయింది. హెూల్‌సేల్ మార్కెట్‌లో ఉల్లి ధర ఎక్కువగా ఉండడంతో రిటైల్ మార్కెట్‌లోనూ ధర పలుకుతోంది. రిటైల్ మార్కెట్‌లో కిలో ఉల్లి ధర రూ.40 నుంచి 50 వరకు పలుకుతోంది. వారం క్రితం వరకు కిలో రూ.20-25కి లభించేది. వాతావరణం అనుకూలించకపోవడంతో ఉల్లి రాక తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు.

# మంత్రుల ఫార్ములా ఇదేనా?

టీడీపీ నుంచి 19 మంది, జనసేన నుంచి 4, బీజేపీ నుంచి 2 సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.కూటమి పార్టీలకు మంత్రి పదవులు సర్దుబాటు చేయడంతో ఆరు మంత్రి పదవులు టీడీపీకి తగ్గుతున్నాయి. దీంతో టీడీపీలో కొంత మందికి మంత్రి పదవులు దూరం అయ్యే అవకాశం ఉంది. సామాజిక కూర్పుతో కూడా కొంత మంది సీనియర్ మంత్రులకు కూడా పదవులు దక్కే అవకాశం లేదు.టీడీపీ నుంచి మంత్రి పదవులు శ్రీకాకుళం నుంచి కూన రవికుమార్(బీసీ), కె. అచ్చెంనాయుడు (బీసీ), కొండ్రు మురళీమోహన్ (ఎస్సీ), విజయనగరం నుంచి గుమ్మడి సంధ్యారాణి (ఎస్టీ), అశోక్ గజపతిరాజు కుమార్తె అతిథి గజపతిరాజు (క్షత్రియ), బేబీ నాయన (వెలమ రాజు), కళా వెంకటరావు (బీసీ), కోళ్ల లలిత కుమారి (బీసీ), విశాఖపట్నం నుంచి గంటా శ్రీనివాసరావు (కాపు), చింతకాయల అయ్యన్నపాత్రుడు (బీసీ), పల్లా శ్రీనివాసరావు (బీసీ), వంగలపూడి అనిత (ఎస్సీ), తూర్పుగోదావరి నుంచి యనమల రామకృష్ణుడు (బీసీ యాదవ), జ్యోతుల నెహ్రూ (కాపు), నిమ్మకాయల చిన రాజప్ప (కాపు), గోరంట్ల బుచ్చయ్య చౌదరి (కమ్మ), పశ్చిమగోదావరి జిల్లాలో నిమ్మల రామానాయుడు (కమ్మ), రఘురామ కృష్ణరాజు (క్షత్రియ), కృష్ణా జిల్లాలో కొల్లు రవీంద్ర (బీసీ మత్స్యకారు), కొలుసు పార్థసారథి (బీసీ యాదవ), బొండా ఉమామహేశ్వరరావు (కాపు), శ్రీరాం తాతయ్య (ఓసీ ఆర్యవైశ్య), తంగిరాల సౌమ్య (ఎస్సీ) రేసులో ఉన్నారు.గుంటూరు జిల్లాలో నారా లోకేశ్ (కమ్మ), పత్తిపాటి పుల్లారావు (కమ్మ), ధూళిపాళ్ల నరేంద్ర (కమ్మ), గల్లా మాధవి (కమ్మ), కన్నా లక్ష్మీనారాయణ (కాపు), నక్కా ఆనంద్ బాబు, తెనాలి శ్రావణ్ కుమార్ (ఎస్సీ), ప్రకాశం జిల్లాలో ఏలూరు సాంబశివరావు (కమ్మ), గొట్టిపాటి రవికుమార్ (కమ్మ), డోలా బాల వీరాంజనేయస్వామి (ఎస్సీ), నెల్లూరు జిల్లాలో పి.నారాయణ (కాపు), కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి (రెడ్డి), ఆనం రామనారాయణరెడ్డి (రెడ్డి), సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి (రెడ్డి) రేసులో ఉన్నారు.కడప జిల్లా నుంచి రెడ్డప్పగారి మాధవి రెడ్డి (రెడ్డి), రాంభూపాల్ రెడ్డి (రెడ్డి), కర్నూలు జిల్లా నుంచి ఎన్ఎండి ఫరూక్ (మైనారిటీ), టీజీ భరత్ (ఆర్యవైశ్య), భూమా అఖిల ప్రియా (రెడ్డి), అనంతపురం నుంచి పరిటాల సునీత (కమ్మ), పయ్యావుల కేశవ్ (కమ్మ), పల్లె సింధూర రెడ్డి (రెడ్డి), కలువ శ్రీనివాసులు (బీసీ), చిత్తూరు జిల్లాలో ఎన్.అమర్ నాథ్ రెడ్డి (రెడ్డి), నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి (రెడ్డి) పేర్లు మంత్రి పదవులకు వినిపిస్తున్నాయి. జనసేన, బీజేపీ నుంచి రేసులో ఉన్నవారు : పవన్ కల్యాణ్ (కాపు), నాదెండ్ల మనోహర్ (కమ్మ), కొణతాల రామకృష్ణ (బీసీ), దేవ వరప్రసాద్ (ఎస్సీ), బొలిశెట్టి శ్రీనివాస్ (కాపు) పేర్లు వినిపిస్తున్నాయి. బీజేపీ నుంచి సుజనా చౌదరి (కమ్మ), సత్య కుమార్ (బీసీ), విష్ణు కుమార్ రాజు (క్షత్రియ) మంత్రి పదవులకు రేసులో ఉన్నారు.అయితే ఇప్పుడు టీడీపీలో ఉన్న సీనియర్లకు మంత్రి పదవులు వచ్చే అవకాశం తక్కువగా ఉంది. సామాజిక కూర్పు, జిల్లాల పరిధి నేపథ్యంలో కొంతమందికి మంత్రి పదవులు రాకపోవచ్చు. గంటా శ్రీనివాసరావు, కళా వెంకట్రావు, అచ్చెన్నాయుడు, నిమ్మకాయల చినరాజప్ప తదితరులకు మంత్రి పదవులు రాకపోవచ్చు. మళ్లీ మంత్రి వర్గ విస్తరణలో వాళ్లకు అవకాశం ఉండొచ్చు.

# మలుపులు..గెలుపులు..




మొదటి పేజి తరువాయి

తలదూర్చేవి కావు. కానీ రాను, రాను అవి కూడా ప్రాంతీయ పార్టీల ధోరణిలో ఆలోచించడం చేస్తున్నాయి. ఆయా రాష్ట్రాలలో పట్టు తెచ్చుకోవడానికి కృషి చేస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని కొన్ని ప్రాంతీయ పార్టీలు వ్యూహాత్మకంగా జాతీయ పార్టీలతో చెలిమి చేస్తున్నాయి. స్వాతంత్రం వచ్చినప్పటినుంచి పలు ప్రాంతీయ పార్టీలు పుట్టాయి. వాటిలో అనేకం జాతీయ పార్టీలలో విలీనం అవడమో, లేక పొత్తు పెట్టుకుని మనుగడ సాగించడమో చేశాయి. నాయకత్వ స్థాయిని బట్టి అవి కొంతకాలం నిలబడగలుగుతున్నాయి. ఉదాహరణకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ ఉవ్వెత్తున పైకి లేచినా, అనతికాలంలోనే పడిపోయింది. ఒంటరిగా పోటీచేసి అధికారం సాధించలేకపోవడంతో తర్వాత కాలంలో కాంగ్రెస్ లో విలీనం అయిపోయింది. ఉమ్మడి ఏపీలో ఉప ప్రాంతీయ పార్టీగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర సమితి 2001లో తన ప్రయాణం ఆరంభించి 2004 ఎన్నికల నాటికి కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకునే దశకు ఎదిగింది. ఆ రోజుల్లో కాంగ్రెస్ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో లేకపోవడంతో టీఆర్ఎస్ కూడా ఉంటేనే ఏపీలో అధికారం సాధించగలుగుతామని నాయకత్వం భావించి పొత్తుపెట్టుకుంది. అది ఫలించింది. కాంగ్రెస్ కూటమిలో భాగస్వామి అయి రెండు చోట్ల అధికారం పొందింది. టీఆర్ఎస్ తెలంగాణ సాధనకు ఏర్పాటైన ఉద్యమ పార్టీ కనుక కొద్దికాలానికే కూటమి నుంచి విడిపోయింది. తదుపరి తెలుగుదేశం, సీపీఐ, సీపీఎంలతో పొత్తు పెట్టుకున్నా పెద్దగా ఫలితం పొందలేకపోయింది. ఆ తర్వాత పరిణామాలలో తెలంగాణ రాష్ట్రం రావడం, ఒంటరిగా టీఆర్ఎస్ పోటీ చేసి అధికారం సాధించడంతో పార్టీకి ఖ్యాతి వచ్చింది. తొమ్మిదినర్రేళ్లపాటు పవర్ లో ఉంది. ఆ క్రమంలో కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ వంటి పార్టీల శాసనసభ పక్షాలను విలీనం చేసుకోవడం విశేషం. కానీ 2023లో జరిగిన ఎన్నికలలో ఓటమి పాలవడంతో సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పార్లమెంటు ఎన్నికలలో ఒక్క సీటు కూడా సాధించలేకపోయింది. అదే టీఆర్ఎస్ కనుక కాంగ్రెస్ లేదా బీజేపీతో పొత్తు పెట్టుకోగలిగి ఉంటే ఈ రోజు పరిస్థితి ఇలా ఉండేది కాదేమో! ఒక దశలో బీజేపీతో స్నేహంగానే ఉన్నా, మరో సందర్భంలో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ కు సహకరించినా ఒంటరిగానే రాష్ట్రంలో రాజకీయం చేసింది. ఆ రెండు పార్టీలు ప్రత్యర్థి పార్టీలుగా మారడంతో బీఆర్ఎస్(పేరు మారిన టీఆర్ఎస్) ఇప్పుడు తన ఉనికిని కాపాడుకునే పనిలో పడింది. కాంగ్రెస్ తెలంగాణలో అధికారం సాధించడానికి యత్నిస్తున్న పార్టీ కావడం, బీజేపీ పొత్తు వల్ల తమకు ముస్లిం మైనార్టీల మద్దతు రాదేమోనన్న అనుమానంతో పొత్తు వైపు బీఆర్ఎస్ చూడలేదు. పైగా తనకు మళ్లీ అధికారం వస్తుందని ఆ పార్టీ అంచనా వేసుకుంది. కానీ అది జరగలేదు. తెలుగుదేశం పార్టీ 1983 నుంచి ఏదో ఒక కూటమిగానే ఉండడం విశేషం. తొలుత సంజయ్ విచార్ మంచ్ అనే పార్టీతో పొత్తు పెట్టుకున్నా, తదుపరి కాలంలో బీజేపీ, సీపీఐ, సీపీఎంలతో స్నేహం సాగించింది.

1994, 1996, 1998లలో వామపక్షాలతో కూటమి కట్టిన టీడీపీ 1999 లో బీజేపీ వైపు జంప్ చేసింది. 2004లో ఓటమి తర్వాత 2009లో టీఆర్ఎస్, వామపక్షాలతో కలిసి పోటీచేసింది. అది ఫలించలేదు. దాంతో తిరిగి 2014 నాటికి బీజేపీతో జత కట్టి లాభం పొందింది. అప్పుడే ఏర్పడిన జనసేన కూడా ఉపయోగపడింది. 2018లో బీజేపీ నుంచి విడిపోయి కాంగ్రెస్ కూటమిలో టీడీపీ చేరి తెలంగాణలో పోటీ చేసింది. అది సఫలం కాకపోవడంతో 2019 ఏపీ ఎన్నికలలో ఒంటరిగా పోటీచేసి దెబ్బతింది. అలాగే జనసేన కూడా 2019లో బీఎస్పీ, వామపక్షాలతో కూటమి కట్టినా ప్రయోజనం కలగలేదు. దానిని దృష్టిలో ఉంచుకుని టీడీపీ వ్యూహాత్మకంగా పావులు కదిపింది. పవన్ కళ్యాణ్ ద్వారా టీడీపీ అధినాయకత్వం ఎన్డీఏ కూటమిలో చేరడానికి ఖర్చీఫ్ వేసింది. ఈలోగా టీడీపీ రాజ్యసభ ఎంపీలు నలుగురిని బీజేపీలోకి పంపించి తన తరపున పనిచేసేలా ఏర్పాటు చేసుకున్నారు. ఇలాంటి వ్యూహాలలో చంద్రబాబు నిపుణుడే అని చెప్పాలి. తొలుత బీజేపీకి అంత ఇష్టం లేకపోయినా, జనసేన ఒత్తిడితో మళ్లీ టీడీపీని ఎన్డీఏ లో చేర్చుకున్నారు. అది సత్ఫలితాన్ని ఇచ్చి రాష్ట్రంలో అధికారం పొందడమే కాక, కేంద్ర ప్రభుత్వానికి కీలకమైన మద్దతు ఇచ్చే దశకు టీడీపీ చేరుకుంది. కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంతంగా వైఎస్సార్సీపీను ఏర్పాటు చేసుకుని ఒంటరిగానే ప్రయాణం సాగించారు. దానినే ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. 2019లో విజయం తర్వాత వైఎస్సార్సీపీ కనుక ఎన్డీఏ లో చేరి ఉన్నట్లయితే కేంద్రంలో తనకు మంచి పట్టు లభించినట్లయ్యేది. కానీ తన వెనుక ఉన్న ఓట్ బ్యాంక్ ఎక్కువగా బీజేపీ వ్యతిరేక భావజాలంతో ఉంటుందన్న భావనతో అలా చేయలేకపోయారు. కానీ ప్రధాని మోదీతో ఉన్న స్నేహం కారణంగా, కాంగ్రెస్ తో సరిపడదు కనుక ఎన్డీఏకే అవసరమైన అన్ని సందర్భాలలో మద్దతు ఇచ్చి వారి అభిమానాన్ని పొందారు.

2024 ఎన్నికల ముందు బీజేపీ కేంద్ర నాయకత్వం వైఎస్సార్సీపీకి పొత్తు ఆఫర్ ఇచ్చినా అందుకు సిద్ధపడలేదని చెబుతారు. ఒకవైపు చంద్రబాబు జాతీయ పార్టీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా తన అవకాశాలను మెరుగుపరచుకుంటే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తనకు ఉన్న ఆత్మ విశ్వాసంతో దెబ్బతిన్నారనిపిస్తుంది. చంద్రబాబు 2019 ఎన్నికల సమయంలో మోదీపై తీవ్ర విమర్శలు చేశారు. అయినా ఇప్పుడు కలవగలిగారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నడూ మోదీపై విమర్శలు చేయలేదు. కానీ ఎన్డీఏతో జతకట్టడానికి సిద్ధపడలేదు. ప్రస్తుతం రాజ్యసభలో పదకుండు మంది, లోక్ సభలో నలుగురు ఎంపీలు వైఎస్సార్సీపీకి ఉన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎన్డీఏతో సంబంధాలు మెరుగుపరచుకోవడం మంచిదని చెప్పాలి. అలా వైఎస్సార్సీపీ చేస్తుందో, లేదో తెలియదు. ఒడిషాలో బిజు జనతాదళ్ అనూహ్యంగా ఓటమిపాలైంది. బీజేపీతో పొత్తు చర్చలు విఫలం అవడంతో ఒంటరిగా పోటీచేసి దెబ్బతింది. అదే ఎలాగోలా రాజీపడి పొత్తుపెట్టుకుని ఉంటే నవీన్ పట్నాయక్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యేవారేమో! అంటే జాతీయ పార్టీతో పొత్తుతో చంద్రబాబు నాయుడు, బీహారు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ వంటి నేతలు రాజకీయంగా, ఇతరత్రా లబ్దిపొందుతుండడం గమనించదగ్గ అంశం. ఇతర రాష్ట్రాలను చూస్తే తమిళనాడులో డీఎంకే గత కొంతకాలంగా కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకుంది. ఇది ఈసారి లోక్ సభ ఎన్నికలలో కూడా ప్రతిఫలించింది. అన్నా డీఎంకే గతంలో మాదిరి బీజేపీతో పొత్తు పెట్టుకోకుండా నష్టపోయింది. బెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ ఇండి కూటమిలో భాగస్వామిగా ఉంటూ జాతీయ స్థాయిలో ఒక అండ పొందిందని చెప్పాలి. అదే సమయంలో రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్, సీపీఎంలతో పోటీ పడుతోంది. ఇదేమీ కొత్త కాదు. కేరళలో కాంగ్రెస్, సీపీఎంలు పరస్పరం పోటీ పడుతాయి. ఢిల్లీ స్థాయిలో మాత్రం కలిసి ఒక కూటమిగా ఉంటున్నాయి. అలాగే వైఎస్సార్సీపీ వంటి పార్టీలు కూడా ఆ తరహా ప్రయత్నాలు చేస్తాయా? లేదా? అన్నది చూడాలి.

ఢిల్లీ, పంజాబ్ లలో అధికారంలో ఉన్న ఆప్ మొన్నటి వరకు ఏ కూటమిలో లేదు. బీజేపీ నుంచి తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటోంది. మద్యం స్కామ్ పేరుతో ఆప్ ను బీజేపీ దడదడలాడిస్తోందన్న భావన ఉంది. దాంతో ఆప్ అధినేత కేజ్రీవాల్ ఇండి కూటమిలో చేరారు. బీహారులో జేడీయూ నేత, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కొంతకాలం కాంగ్రెస్, ఆర్జెడిలతో కలిసి, మరికొంతకాలం బీజేపీతో కలిసి రాజకీయం సాగిస్తూ ఇంతవరకు సఫలం అయ్యారు. ఈ పార్లమెంటు ఎన్నికలలో కూడా ఆయన బీజేపీతో జట్టుకట్టడం ఉపయోగపడింది. ఢిల్లీ స్థాయిలో కీలకమైన వ్యక్తిగా మారారు. మహారాష్ట్రలో శివసేన, ఎన్.సీ.పీలలో చీలిక తెచ్చి బీజేపీ అధికారంలోకి రాగలిగింది. కర్నాటకలో బీజేపీతో జెడిఎస్ జట్టుకట్టడం వల్ల కేంద్రంలో ఆ పార్టీ అధినేత కుమారస్వామి మంత్రి కాగలిగారు. జమ్ము-కశ్మీర్ లోని ప్రాంతీయ పార్టీలు కూడా కేంద్రంలో ఏదో ఒక జాతీయ పార్టీతో కలిసి ఉంటాయి. సిక్కింలో ఘన విజయం సాధించిన సిక్కిం ప్రాంతీయ పార్టీ కేంద్రంలో బీజేపీకి మద్దతు ఇస్తోంది. ఓవరాల్ గా చూసినప్పుడు వీలైతే కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ పార్టీతో కూటమిలో భాగస్వామి అవడమో లేదా సత్సంబంధాలు పెట్టుకోవడమో చేయక తప్పని పరిస్థితులు ప్రాంతీయ పార్టీలకు ఏర్పడుతున్నట్లు అనిపిస్తుంది. అధికార పార్టీతో వీలు కాకపోతే ప్రతిపక్ష కాంగ్రెస్ కూటమిలో అయినా చేరితే ఏదో ఒక అండ దొరికినట్లవుతుందన్న భావన ఏర్పడుతోంది. దేశ రాజకీయాలలో ఇది అత్యంత కీలకమైన పరిణామంగా కనిపిస్తుంది. లేకుంటే రాష్ట్ర స్థాయిలో, కేంద్ర స్థాయిలో ప్రాంతీయ పార్టీలు పలు సమస్యలను ఎదుర్కోవలసి వస్తోంది.

# లోక్ సభ స్పీకర్ గా దగ్గుపాటి పురంధేశ్వరి?

మొదటి పేజి తరువాయి

మంత్రి పదవుల అంశంపై స్పష్టత వచ్చింది.దాంతో, దేశ రాజకీయాలు ఇప్పుడు లోక్ సభ స్పీకర్ పదవి చుట్టూ కేంద్రీకృతమయ్యాయి. ఈ కీలక పదవిని చేజిక్కించుకోవాలని ఎన్డీయేలో కీలక మిత్రపక్షాలుగా ఉన్న టీడీపీ, జేడీయూలు ప్రయత్నిస్తున్నాయి. మరోవైపు, సంకీర్ణ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించాల్సిన స్పీకర్ పదవిని మిత్రపక్షాలకు ఇవ్వాలని బీజేపీ, ప్రధాని మోదీ భావించడం లేదు.ఈ నేపథ్యంలో స్పీకర్ పదవి కోసం బీజేపీ నేత, ఆంధ్ర ప్రదేశ్ బీజేపీ చీఫ్, ఇటీవలి లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ తరపున రాజమండ్రి స్థానం నుంచి గెలిచిన పురంధేశ్వరి పేరు తెర పైకి వచ్చింది. పురంధేశ్వరికి స్పీకర్ పదవి ఇవ్వనున్నారనే వార్తలు గుప్పుమంటున్నాయి.

పురంధేశ్వరికి స్పీకర్ పదవి ఇవ్వడం కోసమే, ఆమెకు మంత్రివర్గంలో చోటు కల్పించలేదని తెలుస్తోంది. మరోవైపు, పురంధేశ్వరికి స్పీకర్ పదవి ఇవ్వడం వల్ల బీజేపీకి వ్యూహాత్మకంగా బీజేపీకి చాలా ప్రయోజనాలున్నాయి. పురంధేశ్వరికి స్పీకర్ పదవి ఇవ్వడాన్ని టీడీపీ చీఫ్, ఎన్డీయేలో కీలక మిత్రపక్షమైన టీడీపీ చీఫ్ చంద్రబాబు నాయుడు వ్యతిరేకించలేరు. ఆమెను కాదని, తమ పార్టీ ఎంపీకి స్పీకర్ పదవి ఇవ్వాలని కోరలేరు. ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ, జనసేలతో కలిసి ఎన్డీయే తరపున ఎన్నికలకు వెళ్లిన చంద్రబాబు.. అటు అసెంబ్లీ, ఇటు లోక్ సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. అందువల్ల, పురంధేశ్వరి స్పీకర్ గా ఎన్నికవడాన్ని చంద్రబాబు వ్యతిరేకించలేరు. అంతేకాదు, చంద్రబాబు భార్య భువనేశ్వరి, పురంధేశ్వరి అక్కా చెల్లెళ్లు. వారిద్దరు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ కుమార్తెలు. ఇవన్నీ కాకుండా, పురంధేశ్వరికి స్పీకర్ పదవిని ఇవ్వడం ద్వారా తమ ప్రభుత్వం మహిళలకు సముచిత స్థానం కల్పిస్తోందని బీజేపీ ప్రచారం చేసుకోవచ్చు.లోక్ సభ స్పీకర్ పదవి రేసులో గత లోక్ సభలో స్పీకర్ గా వ్యవహరించిన ఓం బిర్లా కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

ఆయనవైపే మెజారిటీ బీజేపీ నేతలు మొగ్గు చూపుతున్నారని, గత లోక్ సభ లో ఆయన విజయవంతంగా సభను నిర్వహించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఓం బిర్లా 2024 లోక్ సభ ఎన్నికల్లో రాజస్తాన్ లోని కోటా నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 ప్రకారం లోక్ సభ రద్దు కాగానే స్పీకర్ పదవి ఖాళీ అవుతుంది. కొత్తగా ఎన్నికైన పార్లమెంటు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించడం కోసం రాష్ట్రపతి సీనియర్ ఎంపీని ప్రొటెం స్పీకర్ గా నియమిస్తారు. దీని తరువాత, లోక్ సభ స్పీకర్ ను సాధారణ మెజారిటీతో ఎన్నుకుంటారు. అంటే సభలో ఉన్న సభ్యుల్లో సగానికి పైగా ఎంపీలు ఎన్నుకున్న వ్యక్తి స్పీకర్ పదవి చేపడ్తారు. స్పీకర్ ను నియమించడానికి ఎలాంటి ప్రమాణాలు లేవు. బీజేపీ నేతలు సుమిత్రా మహాజన్, ఓం బిర్లా గత రెండు లోక్ సభల్లో స్పీకర్లుగా వ్యవహరించారు.సభను నడపడానికి స్పీకర్ బాధ్యత వహిస్తారు

కాబట్టి లోక్ సభలో కీలక పదవి. ముఖ్యంగా సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో స్పీకర్ ది అత్యంత కీలకమైన బాధ్యత. స్పీకర్ కూడా ఒక నిర్దిష్ట పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తూ లోక్ సభకు ఎన్నికైన సభ్యుడు కావడంతో ఈ పాత్ర మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. కొందరు నేతలు స్పీకర్ పదవి చేపట్టక ముందే పార్టీని వీడిన సందర్భాలు కొన్ని ఉన్నాయి. ఉదాహరణకు, ఎన్ సంజీవరెడ్డి మార్చి 1967 లో నాల్గవ లోక్ సభ స్పీకర్ గా ఎన్నికైన తరువాత కాంగ్రెస్ కు రాజీనామా చేశారు.

# చంద్రబాబు అనే నేను... ముఖ్యమంత్రిగా 4వ సారి ప్రమాణస్వీకారం


మొదటి పేజి తరువాయి

రాజ్యాంగాన్ని, శాసనాలను అనుసరించి ప్రజలందరికి న్యాయం చేకూర్చుతానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను అంటూ ప్రమాణం ఆచరించారు. అనంతరం, చంద్రబాబును హత్తుకున్న ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరులు చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు 1978లో చంద్రగిరి నుంచి తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన... 1983లో టీడీపీలోకి చేరారు. అప్పటికే ఆయన ఎన్టీఆర్ కుమార్తె భువనేశ్వరి పెళ్లాడారు. చంద్రబాబు 1995లో తొలిసారిగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1999లో తొలిసారిగా ఎన్డీయేకు మద్దతు ప్రకటించారు. అదే ఏడాది రెండోసారి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. 2003లో అలిపిరి వద్ద నక్సల్స్ అమర్చిన క్లేమోర్ మైన్స్ దాడి నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. 2004 ఎన్నికల్లో ఓటమితో చంద్రబాబు అధికారం కోల్పోయారు. తిరిగి 2014లో రాష్ట్ర విభజన అనంతరం జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధించడంతో చంద్రబాబు మూడోసారి ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించారు. 2019 ఎన్నికల్లో బీజేపీ, జనసేన పార్టీలతో పొత్తు లేకుండా పోటీ చేసిన టీడీపీ ఓటమిపాలైంది. ఈసారి 2024 ఎన్నికల్లో పొత్తు పెట్టుకున్న టీడీపీ బ్రహ్మాండమైన విజయం సాధించడంతో చంద్రబాబు నాలుగో పర్యాయం సీఎం అయ్యారు. చంద్రబాబు మంత్రివర్గంలో తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన 10 మందికి చోటు దక్కింది. పవన్‌తోపాటు మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, టీజీ భరత్, ఎస్.సవిత, కందుల దుర్గేష్, సత్యకుమార్ యాదవ్, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి తదితరులు తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, డోలా బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవి,




బీసీ జనార్ధన్ రెడ్డి తదితరులు గతంలో పలుమార్లు ఎమ్మెల్యేలుగా గెలిచారు. కానీ మంత్రివర్గంలో ఎప్పుడూ చోటు దక్కించుకోలేదు. కానీ ఇప్పుడు తొలిసారిగా వీరికి ఆ అవకాశం లభించింది. మొత్తంగా 17 మంది కొత్తవాళ్లు మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. జనసేనకు మూడు, బీజేపీకి ఒక స్థానం కల్పించారు. మరో స్థానాన్ని ఖాళీగా ఉంచారు. గత కొన్ని రోజుల నుంచి మంత్రివర్గ కూర్పుపై కసరత్తు చేసిన చంద్రబాబు.. సీనియర్లు, యువతకు మధ్య సమతూకం పాటిస్తూ జాబితాను రూపొందించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీతోపాటు కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా, రవాణా మంత్రి నితిన్ గడ్కరీ, బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ, ప్రముఖ నటులు చిరంజీవి, రజినీకాంత్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఎల్జేపీ చీఫ్, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్, మాజీ గవర్నర్ తమిళిసై, తదితరులు హాజరయ్యారు.

# ఒడిశా సీఎంగా మోహన్ మాఝీ ప్రమాణం... హాజరైన మోదీ, నవీన్ పట్నాయక్




## ఒడిశా 15వ ముఖ్యమంత్రిగా మోహన్ మాఝీ

## మోహన్ చరణ్ మాఝీతో సీఎంగా ప్రమాణం చేయించిన గవర్నర్

## డీప్యూటీ సీఎంలుగా కేవీ సింగ్ డియో, ప్రవతి పరిడాలు ప్రమాణం

ఒడిశా : ఒడిశా కొత్త ముఖ్యమంత్రిగా మోహన్ చరణ్ మాఝీ బుధవారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో గవర్నర్ రఘుబర్ దాస్ ప్రమాణం చేయించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్, అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ, పలువురు ఎన్డీయే కూటమి నేతలు హాజరయ్యారు. ఉపముఖ్యమంత్రులుగా కేవీ సింగ్ డియో, ప్రవతి పరిడాలు ప్రమాణం చేశారు. భువనేశ్వర్‌లోని జనతా మైదానంలో ప్రమాణ స్వీకార వేడుక జరుగుతోంది. ఒడిశాకు మోహన్ మాఝీ 15వ ముఖ్యమంత్రి. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి 30వేల మందికి పైగా హాజరయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. 67 ప్లాటూన్ల పోలీసులు, యాంటీ టెర్రరిజం స్క్వాడ్‌తో భద్రతా ఏర్పాట్లు చేశారు.

# రోడ్డు లెవెల్ లేకుండ పోసిన కంకర

## ఒక్క వర్షానికే నిలిచిన నీరు...

(రామన్నగూడెం)(**గౌతమ్ న్యూస్ ):** ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్: ఏటూరునాగారం నుండి కమలాపురం వరకు సంవత్సరం క్రితం మొదలు పెట్టిన రోడ్డు పనులు ఎన్నో ఆటంకాల తర్వాత సాగుతుంది. 10 రోజుల క్రితం ఏటూరునాగారం నుండి రామన్నగూడెం వరకు బిటి వేసుకుంటూ వస్తున్నారు కానీ దానికంటే ముందు రోడ్డు వెయ్యడానికి కొలతలు తీసుకొని ఎత్తు పల్లాలు ఉన్న చోట కంకర,చిన్న





కంకర(చిప్స్)పోసి సమాంతరం చేసి ఆ తర్వాత అనుకూలమైన పరిస్థితిలో రోడ్డు వేస్తారు. అయితే రామన్నగూడెం గ్రామంలో బోరుగూడెం వద్ద బుధవారం రాత్రి కురిసిన భారీ ఒక్క వర్షానికే రోడ్డు మీద నీరు నిలవడంతో బాట చారులు ,గ్రామ ప్రజలు ఒక్క వర్షానికే ఇలా నీరు నిలిస్తే శాశ్వతంగా ఉంటుందా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే చాలా ఆలస్యంగా మొదలైన పనులు ఇంకా ఆలస్యం అవడం రోడ్డు కూడా చాలా తక్కువ మందంగా పోస్తున్నారని కొన్ని సంవత్సరాలు కూడా ఉండేలా లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు కూడా కొన్ని చోట్ల ఎత్తు పల్లాలు ఉండడం వలన నీరు లిస్ట్ వేసిన తారు ఎక్కువ రోజులు ఉండదని వర్షానికి కొట్టుకుపోతుందని రోడ్డు ఇంకాస్త మందంగా ఎత్తు పల్లాలు సమాంతరంగా చేసి రోడ్డు కి ఇరువైపులా సమాంతరపు అంచులు ఏర్పాటు చెయ్యాలని సంబంధిత అధికారులు చొరవ తీసుకొని నాణ్యమైన రహదారిని ఏర్పాటు చెయ్యాలని కోరుతున్నారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పాత రిజర్వేషన్‌లు కోనసాగేనా..




టేకులపల్లి **(గౌతమ్ న్యూస్ ):** గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. అయితే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పాత రిజర్వేషన్లు కొనసాగుతాయా...? లేక కొత్తగా రిజర్వేషన్లు అమలు చేస్తారా...అన్నదే ప్రశ్నార్థకంగా మారింది. తెలంగాణ శాసనసభ ఎన్నికలు ముగిశాయి. కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజార్టీతో అధికారం చేజిక్కించుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయి. ఈ మధ్యలోనే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగాల్సి ఉంది. 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రస్తుతం కొనసాగుతున్న పాలకవర్గం పదవీకాలం 2024 జనవరి 31న ముగుస్తుంది. 2024 ఫిబ్రవరి నుంచి నూతన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచ్లు ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నిక కావాల్సి ఉంటుంది. 2018 లో పాలకవర్గం రిజర్వేషన్ 5 సంవత్సరాలకు ఒక కాలపరిమితి, మరొక 5 సంవత్సరాలకు 2 పర్యాయములు సర్పంచులు, వార్డు సభ్యులు 10 సంవత్సరాల కాలానికి ఒకే రిజర్వేషన్ కొనసాగుతుందని గత ప్రభుత్వం చట్టం చేయడం జరిగింది. ఈ విధానం రూపొందించిన బీఆర్ఎస్ ప్రభుత్వం శాసనసభ ఎన్నికలలో పరాజయంతో ప్రభుత్వం మారింది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వం రూపొందించిన 10 సంవత్సరాల కాలపరిమితి, (రెండు పర్యాయాల రిజర్వేషన్) మారుస్తుందా...? లేదా కోనసాగిస్తుందా అనేది చర్చనీయాంశమైంది. గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం సిద్ధమవుతున్న స్థానిక నేతలు రిజర్వేషన్ గురించి ఆలోచనలో పడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్, మహిళా రిజర్వేషన్ ఆశావాహులు సర్పంచ్ అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలో 36 గ్రామ పంచాయతీ ఉన్నాయి. మండలం లో గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ రాకుండానే ప్రస్తుత ప్రభుత్వం రిజర్వేషన్ మార్పు చేస్తే పలానా గ్రామానికి పలాన రిజర్వేషన్ వస్తుందని ఆశావాహులు లెక్కలు వేసుకుంటున్నారు. పోటీకీ సిద్ధంగా ఉన్న అభ్యర్థులు ఇప్పటి నుంచే పోటీ చేస్తానని బహిరంగంగానే గ్రామస్తులకు చెప్పుకుంటు దవాత్ లు ఏర్పాటు చేస్తున్నారు. ఎదిఏమైనా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

## ఏక రూప దుస్తుల పంపిణీ కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించిన

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి.

### పాఠశాలల విద్యార్థులకు ఏక రూప దుస్తుల పంపిణీ కార్యక్రమం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు.

ఏటూరునాగారం (బండారుపల్లి)(**గౌతమ్ న్యూస్ ):** ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్: బుదవారం జిల్లా కలెక్టర్ బండారుపల్లి మోడల్ పాఠశాలలో నూతన 2024-2025 విద్య సంవత్సరం ప్రారంభం లో భాగంగా విద్యార్థులకు ఏక రూప దుస్తుల



పంపిణీ కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బండారుపల్లి మోడల్ పాఠశాలలో 2024-25 నూతన విద్యా సంవత్సరం నకు సంబంధించి గురువారం విద్యార్థులకు ఏక రూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరై పాఠశాల విద్యార్థులకు ఏక రూప దుస్తులులను, పాఠ్య పుస్తకాలను, పంపిణీ చేయనున్నారని తెలిపారు.



ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, జిల్లా సైన్స్ అధికారి జయదేవ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శోభ రాణి , పాఠశాల ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

## గురు శిష్యుల ఆత్మీయ కలయిక




మెట్టుపల్లి **(గౌతమ్ న్యూస్ ):** బుధవారం రోజున 2008-09 ssc batch పూర్వ విద్యర్థులు గురు శిష్యుల ఆత్మీయ కలయిక అనే ప్రోగ్రామ్ తో అందరు ఒక చోట చేరారు ...అలాగే అప్పటి విద్యబోధన చేసిన గురువులు ని పిలిచి వారిని సన్మానించారు అనంతరం గురువులు మాట్లాడుతూ.. నడుస్తున్న పోటీ ప్రపంచం లో మీరందరు ఇంకా ఉన్నత శిఖరాలకు చేరాలని అలాగే మి ద్వారా ఇంకా ఎన్నో మంచి కార్యక్రమాలు చేయాలని సభ ని ఉద్దేశించి మాట్లాడారు..ఇలాంటి వేడుక మాకు కూడా ఒక మంచి కలయిక అని మరి కొందరు ఉపాధ్యాయులు కొనియాడారు పూర్వ విద్యర్థులు మాట్లాడుతూ నాటి మధుర స్మృతులూ గుర్తు చేసుకొని అందరిన ఒక్కసారి తరగతి గది వైపు కి నడిపిస్తున్నట్టు గా మాట్లాడారు తరువాత సారు లకు వీడ్కోలు చెప్తూ కార్యక్రమాన్ని ఎంతో ఉల్లసంగా జరుపుకున్నరు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయలు ప్రధానోపాధ్యాయలు రాజాగంగారం మనోహర్ ,నరసింహ మూర్తి, నాగరాజు,ఫసీయోద్దీన్, హామీదుల్లా ఖాన్, అటెండర్ గంగాధర్ పుర్వ విద్యార్థులు పాల్గొన్నారు

# సస్పెండ్ కు కారణాలు తెలపండి గాడిపర్తి రామకృష్ణ

నందిగామ **(గౌతమ్ న్యూస్ ):** ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఎన్ డి ఏ కుటమీ ఘన విజయం సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని, లోకేష్ బాబు నాయకత్వాన్ని, పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని, ఈ రాష్ట్ర ప్రజలు, అద్భుత అద్భుతమైన విజయాన్ని అందించినందుకు, చాలా గర్వించదగ్గ విషయం, దానిలో భాగంగా, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడిగా, నేను గాడిపర్తి రామకృష్ణ చాలా సంతోషంగా గర్వస్తున్నాను రాష్ట్రంలో 175 నియోజకవర్గాలుగాను 164 నియోజవర్గాలలో విజయం సాధించిన ఎన్ డి ఏ కూటమి అభ్యర్థులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా తంగిరాల సౌమ్య విజయం అత్యధికమైన మెజారిటీతో గెలుపొందిన తంగిరాల సౌమ్య ధన్యవాదాలు. రాష్ట్రంలో2019 నుండి 2024 వరకు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులపై దాడులు అరాచకాలు కేసులు ఇది రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన విషయమే. అదేవిధంగా నందిగామ నియోజకవర్గంలో అనేక వేధింపులకు గురైన గాడిపర్తి రామకృష్ణ అనే నేను తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడిగా నందిగామ నియోజకవర్గంలో మొట్టమొదటగా ఫైర్ నో 330/2019 కే సుబనాయించడం జరిగింది ఈ కేసులో నా వాహనం కూడా సీజ్ చేయటం జరిగింది, ఆ తరువాత నందిగామ నియోజకవర్గంలో తంగిరాల సౌమ్య ప్రజా పోరాటంలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడిగా నేను కూడా పాల్గొంటూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నా వంతు కృషి చేశాను, తెలుగుదేశం పార్టీ చేసిన పోరాటంలో 2023 తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు




నాయుడు 09ః9ః2023 అరెస్టును నిరసిస్తూ ఓ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడిగా అనేక పోరాటాలు చేసిన నేను ఆయన అరెస్టు చాలా ఖండిస్తూ బాధకు గురై నాను అనేక కష్టాలు పడి తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడి గా పోరాటాలు చేసినందుకు నేను గర్వపడుతున్నాను. ఇంత చేసిన గాడి పార్టీ రామకృష్ణ అనే నన్ను తెలుగుదేశం పార్టీకి కాకుండా ఇతర పార్టీలకు సపోర్ట్ చేశానని,అనేక రకమైనటువంటి నిరాధారమైన ఆరోపణలను చేసి, కొంతమంది తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో నా ఎదుగుదలను ఓర్వలేక నాపై నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు కొంతమంది శ్రీమతి తంగిరాల సౌమ్య (ఎమ్మెల్యే ) నాపై నిరాధారమైన ఆరోపణలు చేసి నన్ను తెలుగుదేశం పార్టీ కుటుంబంలో నుండి 09-06-2024 నన్ను తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల్లో నుండి పార్టీలో నుండి నన్ను సస్పెండ్ చేయడం నన్ను చాలా బాధించింది, రాష్ట్రంలో ఎన్ డి ఏ, కూటమికి ప్రజలు, తిరుగులేని తీర్పునిచ్చినట్టే నందిగామ నియోజకవర్గం లో అత్యధిక మెజార్టీతో ఎన్ డి ఏ కూటమి అభ్యర్థిని గెలిపించుకునే భాగంలో నా కష్టమ్ కూడా ఉన్నందున, నన్ను ఎందుకు పార్టీ నుండి సస్పెండ్ చేసినారో,అలానే టీఎన్ఎస్ అధ్యక్షుడు ఈ వురి వినోద్ ని కూడా (టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ఎన్టీఆర్ జిల్లా ) ని కూడా సస్పెండ్ చేయగా మాపై నిరాధారమైన ఆరోపణలు చేసి సరైన వివరణ ఇవ్వకుండా, తెలుగుదేశం పార్టీలో నుండి సస్పెండ్ చేసినందుకు గాను, బాధాతప్త హృదయంతో ఈరోజు మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి, ఈరోజు వరకు తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి నన్ను, ఎందుకు సస్పెండ్ చేశారో వివరణ ఇవ్వవలసిందిగా అడుగుతూ, నాపై సస్పెన్షన్ను ఎత్తివేయాలని కోరుతూ, లేనియెడల మీరు తీసుకున్న ఈ రకమైనటువంటి నిర్ణయానికి, జిల్లాస్థాయి నాయకుల నుండి, రాష్ట్రస్థాయి నాయకుల వరకు, నా గోడును వినిపించి నా సమస్యకు పరిష్కారాన్ని పొందుతానని, తెలియజేసిన, గాడిపత్రి రామకృష్ణ

# సమస్యలతో స్వాగతం పలికిన సర్కార్ బడులు

టేకులపల్లి **(గౌతమ్ న్యూస్ ):** వేసవి సెలవులు ముగియడంతో టేకులపల్లి మండల వ్యాప్తంగా బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. చిన్నారులు ఆటలకు స్వస్తి పలికి పాఠశాలలకు హాజరయ్యారు. మండలంలోని కేజీబీవీ పాఠశాల, గిరిజన ఆశ్రమం పాఠశాల, అలాగే అన్ని గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్న వేసవి సెలవులు తర్వాత 51 రోజులకు పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాగా తయారైంది. మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఏ పాఠశాలలో కూడా స్వీపర్స్ లేకపోవడంతో పాఠశాల వరిసరాలు మొత్తం అపరిశుభ్రంగా మారాయి. పాఠశాల గదులు పరిసర ప్రాంతాలు చెత్తతో దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగి పాఠశాలలు అధ్వానంగా కనిపిస్తున్నాయి. దీంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు సైతం ప్రభుత్వ పాఠశాలల పై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలల వరకు మౌలిక వసతులను కల్పిస్తున్నామని చెప్తున్న అధికారులు వాటిని ఆచరణలో చూపకపోవడంపై గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు ఏకరూప దుస్తులను, పాఠ్యపుస్తకాలను, పాఠశాలకు అందజేశారు.




**తూ... తూ.. మంత్రంగా బడిబాట**

ఈ నెల 3 నుంచి జిల్లాలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని అధికారులు తూతూ మంత్రంగా చేపట్టారు. బడీడు పిల్లలందరినీ చేర్పించేలా ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు పర్యటించి విదాంలో తల్లిదండ్రులను కలుస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో వారి పిల్లలను చేర్పించే విధంగా అవగాహన కల్పించారు. ఆంగ్ల మాధ్యమంలో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నామని వివరిస్తూ పిల్లలను పాఠశాలల్లో చేర్చుకుంటున్నారు. ప్రతీ పాఠశాలలో కనీసం 20 మంది పిల్లలకు తక్కువ కాకుండా ఉండే విధంగా చర్యలను చేపట్టారు.

# నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్

## విద్యార్థులకు ఐఐటి జెఇఇ కౌన్సిలింగ్ ఉచిత ఆన్లైన్ మార్గ దర్శకత్వం ఇస్తున్న

### నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడావత్ మోహన్

మానుకోట జిల్లా(**గౌతమ్ న్యూస్ ):** నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐఐటి, ఎన్.ఐ.టి. పూర్వ విద్యార్థులతో ఉచిత ఐఐటి జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్ కౌన్సిలింగ్, మార్గదర్శకత్వం నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మిషన్ విద్య విజ్ఞాన్ సేవలో భాగంగా ఐఐటి జెఇఇ అడ్వాన్స్ కౌన్సిలింగ్, మార్గదర్శకత్వం తమ సంస్థ ఐఐటి, ఎన్.ఐ.టి, ఐఐఐటి పూర్వ విద్యార్థులచే, అనుభవజ్నులచే సెషన్స్ నిర్వహిస్తున్నట్లు మరియు సహకారం అందిస్తున్నట్లు, ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడావత్ మోహన్, టెలీకామ్ సీనియర్ రీసెర్చ్ ఇంజనీర్, ఎన్.ఐ.టి వరంగల్ పూర్వ విద్యార్థి తెలిపారు. ఉచిత ఐఐటి జెఇఇ మెంటార్షిప్ సెషన్స్ రిజిస్ట్రేషన్ కొరకు తమ ఫౌండేషన్ వాట్సాప్ నంబర్ 7892782387 ఫోన్ నెంబర్లలో సంప్రదించాల్సింది కోరారు. దేశంలోని ఇంజనీరింగ్




విభాగంలో ప్రసిద్ధిగాంచిన ఐఐటి, ఎన్.ఐ.టి, ఐఐఐటి లో ప్రతిభగల పేద విద్యార్థులు అడ్మిషన్ అవ్వాలని, అందుకు కావాల్సిన సలహా, సూచనలు, కౌన్సిలింగ్, మెంటార్షిప్ సెషన్స్, తమ సంస్థ ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు సంస్థ నాణ్యమైన విద్య విభాగం డైరెక్టర్ నరేష్ ఎన్ఐటి దుర్గపూర్ పూర్వ విద్యార్థి తెలియజేసారు. తమ స్వచ్ఛంద సంస్థ ప్రతిభగల పేద విద్యార్థులకు ఎప్పుడు చేయూతగా ఉంటుంది అని, అలాగే ప్రతి గ్రామాల్లో కనీసం 5-6 మంది ఐఐటి, ఎన్ఐటి అడ్మిషన్ పొందేలా తమ గైడెన్స్ - సపోర్ట్ సిస్టం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రోగ్రాం కో-ఆర్డినేటరర్స్ ఐఐటి వారణాసి పవన్, కళ్యాణ్ తెలిపారు. కావున ఇటువంటి ఉచిత ఆన్లైన్ క్లాసులు మరియు సర్వీసులను గ్రామాల్లోని పేద విద్యార్థులు ఉపయోగించుకునేలా సంబంధిత స్కూలు ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, విద్యాశాఖ అధికారులు సహకరించి ఎక్కువ మందికి ఈ సేవలు ఉపయోగపడేలా కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోవాలని సంస్థ జాతీయ కార్యదర్శి జయకృష్ణ, ఐఐటి రోపార్ పూర్వ విద్యార్థి తెలిపారు.

# ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న



## ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు

మానుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్ ):** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శనిగపురం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు. మన ఊరు మన బడి పాఠశాల ప్రత్యేకతలు ఆహ్లాదకరమైన పాఠశాల, తెలుగు / ఇంగ్లీష్ మీడియంలలో విద్యాబోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్, 2 జతల ఉచిత యూనిఫామ్స్, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనము, విద్యార్థులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, ఆహ్లాదకరమైన వాతావరణం, విశాలమైన తరగతి గదులు, ఒత్తిడి లేని విద్య, సాంస్కృతిక కార్యక్రమాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధన, విలువైన పుస్తకాలతో గ్రంథాలయం ఉన్నది. శనిగపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ మాట్లాడుతూ గత సంవత్సరం పదోతరగతిలో 23 మంది విద్యార్థులు ఉండగా 21 మంది ఉత్తీర్ణులై ఉత్తమ ఫలితాలు సాధించారు. 92 శాతం విద్యార్థులు పాసై బయటికి వెళ్లారు. ముఖ్యఅతిథి తక్కెళ్ళపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ ఈ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను చూస్తుంటే చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి. మేము ఈ స్థాయి ఉన్నాము అంటే ప్రభుత్వ పాఠశాలలో చదవడమే మొదటి కారణం. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి మంచి మంచి ర్యాంకులు సాధించి ఉన్నత స్థాయిలో ఎదగాలని, భవిష్యత్తు తరాలు బాగుపడాలంటే విద్యార్థి దశ నుంచే మొదలు కావాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీందర్ రావు విద్యార్థినీ విద్యార్థులకు పుస్తకాలు, రెండు జతల బట్టలు పంపిణీ చేశారు. అదేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం వచ్చినా ముఖ్య అతిథులను సన్మానించి జ్ఞాపికను ఇవ్వడం జరిగింది. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న వారు ఎమ్మెల్సీ తాక్కేళ్లపల్లి రవీందర్ రావు, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ మున్సిపల్ చైర్మన్ మార్నేని వెంకన్న, మున్సిపల్ కౌన్సిలర్లు హరి నాయక్, ఎడ్ల వేణు, డౌలాగారు శంకర్, మాజీ రాష్ట్ర అడవి పరిరక్షణ సమితి బానోత్ రవి కుమార్, బీఆర్ఎస్ సీనియర్ లీడర్ మంగళంపల్లి వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్ రెడ్డి, శనిగపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళి, అమ్మ ఆదర్శ పాఠశాల ఉపాధ్యయులు, ఆశ వర్కర్స్, అంగన్వాడీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక



# వర్కింగ్ జర్నలిస్ట్ ల పిల్లలకు ఫీజులో రాయితీ కల్పించండి

## తెలంగాణ మాల జర్నలిస్ట్ ల యూనియన్ జిల్లా అధ్యక్షులు చంద శ్రీనివాస్



మానుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్ ):** మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వర్కింగ్ జర్నలిస్ట్ ల పిల్లలకు అన్ని ప్రయివేట్ పాఠశాలలో ఉచితవిద్య కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, జిల్లా విద్యాధికారికి వినతి పత్రాలను అందజేసిన తెలంగాణ మాల జర్నలిస్ట్ ల యూనియన్ జిల్లాఅధ్యక్షులు చంద శ్రీనివాస్, జిల్లాప్రధాన కార్యదర్శి బేతమల్లు సహదేవ్, జిల్లా గౌరవ అధ్యక్షులు బొడ్డు అశోక్, సంఘం నాయకులు కొప్పుల శ్రీనివాస్, గండమాల రోషయ్య, కమటం నాగేశ్వరరావు, కార్తీక్ లు ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చంద శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అక్రిడేషన్లతో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్టు అందరి పిల్లలకు ప్రతి ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులో రాయితీ కల్పించాలి. ప్రైవేట్ పాఠశాలలో ఫీజు రాయితీ ఇవ్వకపోతే డీఈఓ స్పందించి వెంటనే పాఠశాల పర్మిషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# సింగరేణిలో ఇటీవల విడుదల చేసిన ఎంప్లాయిమెంట్ నోటిఫికేషన్ ను కొనసాగింపుగా

## బీటెక్( మైనింగ్) ఫైనలియర్ చదువుతున్న వారికి మైనింగ్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం.

## సింగరేణి జిఎం పర్సనల్,వెల్ఫేర్ అండ్ ఆర్. సి బి.ఆర్ దీక్షితులు.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి**(గౌతమ్ న్యూస్ ):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ వారు తేది 23.02.2024 న విడుదల చేసిన ఎక్స్టర్నల్ ఎంప్లాయిమెంట్ నోటిఫికేషన్ నం 01/2024 కు కొనసాగింపుగా బి.టెక్. (మైనింగ్) ఫైనల్ ఇయర్ చదువుతున్న వారికి మేనేజ్మెంట్ ట్రైనీ మైనింగ్ ఉద్యోగానికి ధరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తూ కొరిజెండమ్ (సవరణ) ను విడుదలచేశారు. బి.టెక్. (మైనింగ్) ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు తేది 13/06/2024 నుండి 19/06/2024 వరకు సింగరేణి సంస్థ వెబ్సైట్ (https://scclmines.com) నందు మేనేజ్మెంట్ ట్రైనీ మైనింగ్ ఉద్యోగానికి ధరఖాస్తు చేసుకొనవచ్చునని మరియు పూర్తి వివరాలకు నోటిఫికేషన్ చూడవలసిందిగా జి.ఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్.సి. బి.ఆర్.దీక్షితులు తెలియజేసారు.

# బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న

## సిపిఐ కౌన్సిలర్లు అనంతరం విద్యార్థులకు దుస్తుల పంపిణీ

## దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉంది

## సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధి రెడ్డి



మానుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్ ):** బుధవారం మహబూబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డ్ పరిధిలో ఎంపీపీస్ కట్టెలమండే పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు



పుస్తకాలు, దుస్తుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి, 36వ వార్డు కౌన్సిలర్ బి.నీరజారెడ్డి ధర్మన్న లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలన్నారు. దేశంలో ఎంతోమంది మేధావులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి గొప్ప గొప్ప వారయ్యారని, ప్రతి ఒక్క తల్లిదండ్రులు బాధ్యతతో తమ యొక్క పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించి తమ అభివృద్ధికి తోడ్పడాలని, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ఉపాధ్యాయులు అందించుతున్నారన్నారు దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని అన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 36వ వార్డు కౌన్సిలర్ బి.నీరజారెడ్డి ధర్మన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్, అంగన్వాడి సూపర్వైజర్ ఉషారాణి, అంగన్వాడి టీచర్లు, పెరుగు వరలక్ష్మి, మాధవి, విద్యార్థులు, గర్భిణీ స్త్రీలు, విద్యార్థుల తల్లిదండ్రులు, భారత రమేష్ కార్తీక్, మెతుకు కుమార్, పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, మాలోతు రవీందర్, నక్క నాగార్జున, జానీ పాల్గొన్నారు.

# వర్కింగ్ జర్నలిస్ట్ పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్య కల్పించలని కలెక్టర్ కు వినతిపత్రం

## టీఎంజేయు డిమాండ్



ఆనుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్ ):** మహబూబాబాద్ జిల్లా పత్రికల్లో, మీడియాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాలని కోరుతూ బుధవారం తెలంగాణ మాల జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. స్పందించిన జిల్లా కలెక్టర్ జర్నలిస్టులకు న్యాయం చేస్తానని హామీ ఇస్తూ జిల్లా విద్యాధికారికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం డిఇఓ కి కూడ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మాల జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షులు చంద శ్రీనివాస్ మాట్లాడుతూ మహబూబాద్ జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాలని డిమాండ్ చేశారు. ఇందుకు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం కూడా సహకరించాలని కోరారు. చాలా జిల్లాలలో జర్నలిస్టులకు ప్రైవేటు పాఠశాలలతో ఉచిత విద్య అవకాశం కల్పిస్తున్నప్పటికీ మహబూబాబాద్ జిల్లాలో మాత్రం అందుకు భిన్నంగా కొనసాగుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగేజిల్లాలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా జర్నలిస్టుల పక్షాన స్పందించి ప్రవైట్ పాఠశాలలో ఫీజు రాయితీ కల్పించే విధంగా విద్యాశాఖపై ఒత్తిడి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి సంవత్సరం జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాటలలో కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య అందేలా రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల పక్షాన ప్రత్యేకమైన జీఓ తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల జర్నలిస్ట్ సంఘం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేతమల్ల సహదేవ్, జిల్లా గౌరవ అధ్యక్షులు బొడ్డు అశోక్, సంఘం నాయకులు కొప్పుల శ్రీనివాస్, గండమల్ల రోశయ్య, కమటం నాగేశ్వరరావు, కార్తీక్, లు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణం లో విద్యార్థులకు ఘన స్వాగతం పలికిన

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి**(గౌతమ్ న్యూస్ ):** జూన్ 12 పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల పాల్వంచ మండలం ప్రశాంత్ నగర్ ఎంపీపీ ఎస్ పాఠశాల, లక్ష్మీదేవిపల్లి మండలం కొత్తూరు ఎంపీపీ పాఠశాల, గొల్లగూడెం జిపిఎస్ పాఠశాల మరియు చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోని ఎంపీపీ ఎస్ పాఠశాలలో జరుగుతున్న బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ విద్యార్థిని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు మరియు ఏకరూప దుస్తులు పంపిణీ చేపట్టారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12 అంటేనే పాఠశాలలు ప్రారంభం మనందరికీ తెలుసు అని, సుమారు 50 రోజుల సెలవులు అనంతరం తిరిగి పాఠశాలలకు విద్యార్థులు వచ్చే రోజు చాలా ముఖ్యమైనదని ఆమె తెలిపారు. పండుగ వాతావరణం లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించటం చాలా సంతోషకరమని ఆమె తెలిపారు. బడిబాట కార్యక్రమం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నప్పటికీ ఈ సంవత్సరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నప్పటికీ, ఎన్నికల సంఘం కల్పించిన ప్రత్యేక వెసులుబాటుతో మూడు నెలలు ఎంతో కష్టపడి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలలన్నిటికీ మరమ్మత్తులు చేపట్టామని తెలిపారు. గత కాలంలో జూన్ నెలాఖరు నాటికి పాఠ్యపుస్తకాలు పంపిణీ జరిగేదని కానీ ప్రస్తుతం ముఖ్యమంత్రి గారి చొరవతో విద్యా సంవత్సరం మొదటి రోజే విద్యార్థులకు ఏక రూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ జరిగాయని తెలిపారు. ఖచ్చితమైన ప్రణాళిక ద్వారా మాత్రమే పాఠశాలలో మొదటి రోజున ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు మరియు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు విజయవంతం చేయగలిగామని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో 63 వేల మంది విద్యార్థులు విద్యార్థులకు కేవలం 20 రోజుల్లోనే తయారీ ప్రక్రియ పూర్తి చేసామని, దీనికోసం అధికారులు రాత్రింబవళ్లు కష్టించారని తెలిపారు. జిల్లాలోని 858 పాఠశాలలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పనులు చేపట్టామని. మరమ్మత్తుల కోసం 26 కోట్ల నిధులు మంజూరు చేశామని తెలిపారు. ప్రతి పాఠశాల గదులలో రెండు ఫ్యాన్లు రెండు లైట్లు, తాగునీరు, మరియు విద్యార్థిని, విద్యార్థులకు మరుగుదొడ్లు విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేశామని తెలిపారు. కేవలం నెలన్నర వ్యవధిలో 70% పాఠశాలలు పనులు పూర్తి చేశామని, రానున్న 15 రోజుల్లో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పనులు పూర్తి అవుతాయని తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యా పాఠశాలలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులు కల్పించే వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి సాధించిందని, అన్ని సదుపాయాలు కల్పించిందని ఆమె తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఎంతో అనుభవం కలిగిన వారని ప్రతి ఒక్క విద్యార్థి పైన ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. రాబోవు రోజుల్లో విద్యారంగంలో ఇంకా ఎక్కువ సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లో మరే ఇతర పనులకు వెళ్లరాదని కలెక్టర్ కోరారు. విద్యార్థుల చదువు తల్లిదండ్రుల కు భారం కాకుండా ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని ప్రైవేటు విద్యాసంస్థలకు వెళ్లి ఫీజులు భారం ఆమె తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో బోధనలు ప్రభుత్వం చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం మండలం గొల్లగూడెం జిపిఎస్ పాఠశాల నందు బడిబాట కార్యక్రమం గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, కొత్తగూడెం మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, డి ఆర్ డి ఓ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన స్వామి, తాసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎంపీపీలు మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ గా మార్నేని రవీందర్ ఏకగ్రీవం



హన్మకొండ**(గౌతమ్ న్యూస్ ):** తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ గా మార్నేని రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య ను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తో పాటు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం టీఎస్ సిఎబి చైర్మన్ ను కడియం శ్రీహరి, కడియం కావ్య అభినందనలు తెలియజేశారు.

# వర్ధన్నపేట ఎమ్మెల్యేను సన్మానించిన కూనూరు రంజిత్ గౌడ్





హన్మకొండ**(గౌతమ్ న్యూస్ ):** పార్లమెంట్ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి ఎంపీ గా కడియం కావ్య ను భారీ మెజారిటీతో గెలిపించి మొదటిసారిగా హసన్పర్తి మండల పరిధిలోని సిద్దాపురం గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు కు అధికార ప్రతినిధి కూనూరు రంజిత్ గౌడ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తంగేళ్లపల్లి తిరుపతి, మండల ఉపాధ్యక్షుడు మందరాజు, పెంబర్తి మాజీ సర్పంచ్ జోరిక పూల, గౌడ సంఘం అధ్యక్షుడు నందం, బొక్క చిరంజీవి, కిరణ్, శ్రీధర్, మహేష్,



రాకేష్ ,శివ నవీన్, మహిళలు, యువకులు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# మడికొండలో ఆత్మీయ సమ్మేళనం





హన్మకొండ**(గౌతమ్ న్యూస్ ):** మడికొండలోని శ్రీ సత్య సాయి కన్వెన్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వరంగల్ పార్లమెంట్ ఎంపీగా కడియం కావ్య ను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు పాల్గొన్నారు. అనంతరం సత్య సాయి కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్చార్జ్లు, మేయర్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లావుడ్య నిఖిత 10 జీపీఏ సాధించిన సందర్భంగా సన్మానించిన

## కాళోజి వాకర్స్ అసోసియేషన్ మానుకోట




మానుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్ ):** బుధవారం ఉదయం మహబూబాబాద్ కాళోజి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లాలోని 102 ప్రభుత్వ పాఠశాలల్లో నుండి 3,000 మంది విద్యార్థులు 10 వ తరగతి పరీక్షలకు హాజరుకాగా ఒక విద్యార్థిని మాత్రమే జడ్పిహెచ్ఎస్ ఈదులపూసపల్లి లో చదివిన లావుడ్య నిఖిత 10 జీపీఏ పొందిన సందర్భంగా మెమంటో, శాలువాతో సత్కరించి, ఆక్స్ఫోర్డ్ డిక్షనరీ, సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర పుస్తకాన్ని కూడా అందించడం జరిగినది. 10/10 జీపీఏ సాధించిన అమ్మాయిని సన్మానించిన కార్యక్రమానికి నామిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య సలహాదారులు మైస శ్రీనివాస్ సమన్వయకర్త సోమ విష్ణువర్ధన్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ చదువుకు పేదరికం, కులం, మతం అడ్డు కాదని నికిత నిరూపించిందని మునుముందు మరిన్ని విజయాలు సాధించాలని సివిల్స్ వరకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాళోజి వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు పట్టాభి లక్ష్మయ్య, మద్దెర్ల రాజన్న, పూజారి వెంకటేశ్వర్లు, జగదీష్, వెంకటేశ్వర్లు, బద్రు శ్రీహరి, వేముల రవీందర్, యాకయ్య, అవునూరి రవి, దేవుడి మధుసూదన్ రెడ్డి, మేడ వెంకట్, కుర్ర మహేష్, ఉపేందర్, వెంకన్న, ప్రభాకర్, కోడెమ్ శ్రీను, విద్యాసాగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పూజారి వీరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పుస్తకాలు, యూనిఫామ్ లు పంపిణీ చేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హన్మకొండ **(గౌతమ్ న్యూస్ ):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ వంగపహాడ్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను పునఃప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలో సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయికి వెళుతున్నారని, ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ పాఠశాలలో అనేక మౌలిక సదుపాయాలను కల్పించి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడం లక్ష్యంగా మంచి విద్యను బోధించడం జరుగుతుందన్నారు.ఉచితంగా అందిస్తున్న విద్యను అభ్యసించి పై స్థాయికి వెళ్ళాలని,ప్రతి తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించి వారు కూడా భాగస్వాములు అవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థి, విద్యార్థినీలు మరియు కాంగ్రెస్ పార్టీ 2వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పొన్నాల రఘు, అనిల్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రాలో ప్రమాణ స్వీకారం సందర్భంగా సంబరాలు

అన్నపురెడ్డిపల్లి**(గౌతమ్ న్యూస్ ):** అన్నపురెడ్డిపల్లి మండలం కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహాకూటమి జనసేన టిడిపి బిజెపి ఎన్నికల





ప్రమాణస్వీకారం సందర్భంగా అన్నపురెడ్డిపల్లి లో బైక్ ర్యాలీ కేక్ కటింగ్ చేయడం జరిగింది. మూడు పార్టీలు కూటమి కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా శాంతియుతంగా సామరస్యంగా కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు మరియు జనసేన కార్యకర్తలు పానుగంటి రామారావు, వేములపల్లి చందర్రావు, మల్యాల స్వామి గంధం పుల్లారావు, బాణావత్ నాగు, తేజవత్ నాగప్రసాద్, షేక్ నాగుల మీరా, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

అన్నపురెడ్డిపల్లి**(గౌతమ్ న్యూస్ ):** అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలో మంగళవారం నా రాత్రి




సుమారు 9 గంటల సమయంలో అన్నపురెడ్డిపల్లి ఎస్సై చంద్రశేఖర్ తన సిబ్బందితో ఎర్రగుంట గ్రామంలో వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఒక కారులో ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా వారిని విచారించగా వారు అన్నపరెడ్డిపల్లి పరిధిలోని ఎర్రగుంట గ్రామంలో ఈ సందర్భంగా చంద్రుగొండ పరిధిలో రెండు దొంగతనాలు చేశారు అని అలాగే వారిపై గతంలో గతంలోనూ గుడివాడ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం కేసులు ఉన్నాయని జైలుకు కూడా వెళ్లి వచ్చామని మళ్లీ దొంగతనం చేయటానికి ఇటువైపు రాగా పోలీసు వారు పట్టుకున్నారు వారి వద్ద ఒక స్విఫ్ట్ కారు బజాజ్ పల్సర్ బైక్ మరియు సుమారు ఒక లక్ష 44 వేల రూపాయలు చోరీ చేసిన సొత్తు స్వాధీనం చేసుకోవడం జరిగింది దీనిపై జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ ఇంద్రసేనారెడ్డి,ఆధ్వర్యంలో చంద్రుగొండ ఎస్సై మాచినేని రవి, అన్నపురెడ్డిపల్లి ఎస్సై చంద్రశేఖర్, విచారణ అనంతరం నిందితులను కోర్టు ముందు హాజరు పరచడం జరిగింది.



# ప్రభుత్వ పాఠశాలల్లోనే క్వాలిటీ విద్య

### ప్రభుత్వ విద్యవిధానం బలోపేతానికి కృషి
### అశ్వరావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ



అన్నపురెడ్డిపల్లి /చంద్రుగొండ,(**గౌతమ్ న్యూస్** ): ప్రభుత్వ పాఠశాలల్లోనే క్వాలిటి విద్య లభిస్తుందని అశ్వరావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ అన్నారు. బుధవారం చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్భాగాంధీ బాలికల వసతిగృహంలో జరిగిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని, విద్యార్థులు పుస్తకాలు, దుస్తులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారయణ మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలలు, విధ్యవిధానం బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయుల చేత విద్యబోధన ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థుల భవిష్యత్కు ఉపయోగపడే విధానంలో బోధన చేయాలని, మంచి భవిష్యత్ కోసం క్రమశిక్షణ వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. మంచి ఉపాధ్యాయుల ఉన్న పాఠశాల దేవాలయంతో సమానమన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ప్రతిరోజూ పాఠశాలలకు పంపితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ అశోక్, తహసీల్దార్ సంధ్యరాణి, ఎంఈఓ సత్యనారాయణ, హెచ్ఎం నాబీద్, కెజిబివి స్పెషలాఫీషర్ ప్రియాంక, ప్రజాప్రతినిధులు, నాయకులు మాలోత్ బోజ్యనాయక్, అంకిరెడ్డి క్రిష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాదాలు జరిగితేనే పట్టించుకుంటారా...

### కల్వర్టు స్లాబ్ ఐరన్ తేలి దర్శనం.....నాణ్యతాపనులకు తిలోదకాలు.



బయ్యారం,(**గౌతమ్ న్యూస్** ): ప్రభుత్వాలు ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఎన్నో మౌలిక వసతులను వారి దరి చేర్చేందుకు నిధులు వెచ్చిస్తూ గుత్తేదారులకు పనులు అప్పగించింది. కాంట్రాక్ట్ దక్కించుకున్న సదరు గుత్తేదారు మాత్రం అందరూ మనవారే అడిగే వారు లేరు అన్న చందంగా పనులు చేస్తూ మా...మా ...అనిపించారు. అధికారులు, గుత్తేదారు కూడబలుకుకొని ఆ బిల్లులు కాజేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.. వివరాల్లోకి వెళితే 2021- 22 ఆర్థిక సంవత్సరంలో వెంకట్రాంపురం నుండి చోక్లాతండా వెళ్లే ప్రధాన రహదారి మార్గమధ్యంలో దొమ్మరదాని చెరువు నుండి వచ్చే వాగుపై పాత కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో వాహన దారుల ఇబ్బందులు గుర్తించిన అధికార యంత్రాంగం ఆ స్థానంలో ఆర్ అండ్ బి అధికారుల ఆదేశానుసారం కల్వర్టు నిర్మాణానికి 40 లక్షల నిధులు ఆనాటి ప్రభుత్వం వెచ్చించి గుత్తేదారుకు సుమారుగా 40 లక్షల నిధుల కాంట్రాక్ పనులు అప్పగించటంతో గుత్తేదారు పనులు చేపట్టారు.ఆ పనులలో నాణ్యత లోపించడంతో కల్వర్టు స్లాబ్ పై ఇనుప చువ్వలు తేలి ఉండటంతో అటువైపు వెళ్లే వాహనదారులు, స్థానికులు మండిపడుతున్నారు.అధికారుల అండదండలతో తూ..తూ మంత్రంగా పనులు కాజేసిన గుత్తేదారుడికి బిల్లులు చెల్లించినా కల్వర్టు నిర్మాణం మున్నాళ్లకే శిథిలావస్థ స్థితికి చేరిందని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు.

# బడిబాట కార్యక్రమం లో ఏర్పాట్లు



మెట్టుపల్లి (గౌతమ్ న్యూస్) బుధవారం రోజున బడిబాట కార్యక్రమం సందర్భంగా బాలికల ఉన్నత పాఠశాల మెట్పల్లిలో జిల్లా కలెక్టర్ శ్రీమతి యాస్మిన్ భాష పాల్గొనుచున్నందున మున్సిపల్ కమిషనర్ శ్రీ టి మోహన్ మరియు ఎంపీడీవో శ్రీ రామకృష్ణ బడిబాట కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించినారు ఈ కార్యక్రమంలో ఎంపీఓ మహేశ్వర్ రెడ్డి ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ గుర్రం రత్నాకర్ టి యం సి సోమిడీ శివ ముజీబ్ నిజాం అశోక్ పాల్గొన్నారు

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే

### కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తాం....కోరం కనుకయ్య.



బయ్యారం,(**గౌతమ్ న్యూస్** ): కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తామని ఇల్లెందు శాసనసభ్యులు కోరం కనకయ్య అన్నారు.బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై బాధితులకు చెక్కుల పంపిణీ నిర్వహించారు.బయ్యారం మండలంలో ఎన్నికల ముందు కళ్యాణ లక్ష్మి దరఖాస్తు చేసుకున్న వారికి ఒక లక్ష 116 రూపాయలు, ఒక్కొక్కరికి చెక్కుల రూపంలో అందించారు. మండలంలో మొత్తం 41 మందిలో బీసీ లకు 34 ,ముస్లిం మైనారిటీ 02, ఎస్సీలు 02 ,ఈ బీసీలు 02లకు చెక్కులు అందజేశారు.ఈ కార్యక్రమంలో బయ్యారం మండల ఎంపీపీ చేపూరి మౌనిక, సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి ,ఎంపీడీవో శ్రీనివాస్ రావు, ఎంపీటీసీ తిరుమల శైలజ రెడ్డి,తహసీల్దార్ సాదియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



# రైతులకిచ్చిన హామీలు అమలు చేయాలి

### ఎ ఐ కె ఎం ఎస్ జిల్లా అధ్యక్షులు సనప పొమ్మయ్య.




బయ్యారం(**గౌతమ్ న్యూస్** ): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సనప పోమ్మయ్య అన్నారు. రైతాంగ సమస్యలపై బయ్యారం తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. నకిలీ విత్తనాలు, ఎరువులు మార్కెట్లోకి రాకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో కేదాస్ భాస్కర్, అరేం కోటమ్మ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా ప్రయివేటు పాఠశాలల కరపత్రాల ప్రచారం...

### చూసి చూడనట్లు విద్యాశాఖ అధికారులు
### పాఠశాలల యాజమాన్యం ఇంగ్లీష్ మీడియం అంటూ ఫీజుల దోపిడీ...

బయ్యారం,(**గౌతమ్ న్యూస్** ): మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో ప్రతి విద్యాసంవత్సరంలో ప్రయివేటు పాఠశాల యజమానులు విద్యాశాఖ అధికారుల ,ప్రజా ప్రతినిధుల



సహకారంతో ప్రభుత్వం అనుమతి లేకుండా ఏజేన్సీ గ్రామాల్లో విద్యార్థుల తల్లి దండ్రులను మోసం చేస్థూ వారి పాఠశాల గోడ పత్రికలు, కరపత్రికలు ప్రచురించి అబద్ధపు ప్రచారంతో వారిని ఆకట్టుకుంటూ అడ్మిషన్ల ప్రారంభం అంటూ వేల రూపాయలు పేరెంట్స్ నుండి కాజేస్తున్నారు.బయ్యారం మండలంలో విద్యాశాఖ 5 ప్రయివేటు పాఠశాలలకు అనుమతి ఇచ్చినట్లు సమాచారం. వాటిలో మండలంలో గందంపల్లి పంచాయతీ పరిదిలో అక్షరవిద్యాయం ,శ్రీ గాయత్రి టెక్నో స్కూల్ (మాస్టర్ మైండ్ ) బయ్యారం మండల కేంద్రంలో,విశ్వ జ్యోతి సొసైటీ ఎడ్యుకేషన్ (న్యూ ఆక్స్ ఫర్డ్),నిర్మల్ గ్రామ్ ఇంగ్లీషు మీడియం,శ్రీరామ ఇంగ్లీష్ మీడియం (బ్రిలియంట్ స్కూల్) ఉన్నాయి.

### పాఠశాల అనుమతి ఒక పేరు
### నడిచేది ఇంగ్లీష్ మీడియం పేరు.

బయ్యారం మండల విద్యాశాఖ అధికారులతో ప్రయివేటు పాఠశాలలు యజమానులు తమకున్న పలుకు బడితో పాఠశాల ఒక




పేరు మీద అనుమతి పొంది,వారికి నచ్చిన పేర్లతో ఇంగ్లీష్ మీడియం



పేర్లతో గత కొంత కాలంగా గుట్టు చప్పుడు కాకుండా మండల విద్యాశాఖ అధికారుల ప్రోద్భలంతో నడిపిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి .వాటిలో బ్రిలియంట్ ,న్యూఆక్స్ ఫర్డ్,మాస్టర్ మైండ్ ఇంగ్లీష్ మీడియా అంటూ తమ కార్యకలపాలను కొనసాగిస్తున్నట్లుగా సమాచారం. తెలుగు మీడియం పేర్లతో ప్రభుత్వ అనుమతి తీసుకొని ఇంగ్లీష్ మీడియం స్కూల్ పేర్లతో నడుస్తున్న అధికారులకు కనిపించడం లేదా అనే విమర్శలు మండలంలో వ్యక్తం అవుతున్నాయి.

### నిబంధనలకు తూట్లు,ఇష్టారాజ్యంగా అనుమతులు.

ప్రయివేటు పాఠశాలకు అనుమతి కావాలంటే విద్యార్థులకు పక్కా భవన సముదాయం ,క్రీడా ప్రాంగణం,రోడ్డు రవాణా అధికారులు ఫిట్ నెస్ లేనీ వాహనాలతో విద్యార్థులను తరలిస్తూ ఉన్నట్లు తెలుస్థుంది .అదే విదంగా ,మౌళిక వసతులు ,ఫైర్,అనుమతి ,పొంది ఉండాలి. కాని నిబంధనలకు , ప్రమాణాలకు విరుద్ధంగా ప్రయివేటు పాఠశాలకు యదేచ్ఛగా ,అధికారులు మ్యామ్యాలకు అలవాటు పడి, అనుమతులు ఇచ్చినట్లు బహటంగా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

### అక్షర విద్యాలయం,గ్లోబల్ ప్రచారం.

గంధంపల్లి పంచాయతీ పరిదిలో అక్షర విద్యాలయంనకు నర్సరీ నుండి 7 వ ,తరగతి వరకు విద్యాశాఖ అధికారుల అనుమతి పొందినట్లు సమాచారం.ఈ విద్యా సంవత్సరం ఆరంభం అవుతున్న సమయంలో నర్సరీ నుండి 10 వ ,తరగతి అనుమతిపొందినట్లు పాంప్లేట్ల ముద్రించి ఏజేన్సీ గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్థున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఎమ్ ఇ ఓ పూల్ చంద్ వివరణ కోసం ప్రయత్నం చేయగా వారు స్పందించలేదు.

# మార్నేని రవీందర్రావు కు శుభాకాంక్షలు తెలిపిన

### డా. పెరుమండ్ల రామకృష్ణ




హన్మకొండ(**గౌతమ్ న్యూస్** ): రాష్ట్ర కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ గా మార్నేని రవీందర్రావు ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో వరంగల్ నుంచి తొలిసారి రాష్ట్ర చైర్మన్ గా ఎన్నికైన రవీందర్రావును వారి కార్యాలయంలో డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా సత్కరించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ... టి ఎస్ సి ఏ బి చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం తరపున రవీందర్రావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. పేద మరియు దళిత రైతులకు రుణాలు ఇచ్చి, రైతులను ఆదుకునే పథకాలతో రవీందర్రావు నిత్యం అందుబాటులో ఉండి అందరికీ చాలా సంవత్సరాల నుండి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. రైతుల పడే ఇబ్బందులు సీఎం దృష్టికి తీసుకెళ్తూ వారికి కావలసిన సహాయ, సహకారాలు అందించాలని రామకృష్ణ కోరారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ కు రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సి డిపార్ట్మెంట్ సెక్రటరీ ఈర మహేందర్ ,జోజి రెడ్డి ,మండల అధ్యక్షులు బుచ్చిరెడ్డి, మహేష్ గౌడ్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



హనుమకొండ(**గౌతమ్ న్యూస్** ): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ, సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పిలుపునిచ్చారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం కలెక్టరేట్లో జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

# ఫీజుల నియంత్రణ చట్టాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలి



హన్మకొండ(గౌతమ్ న్యూస్ ): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ... ప్రైవేట్ పాఠశాలలో షూ, టై,బెల్ట్, పాఠ్యపుస్తకాల దందా ను బంద్ చేయాలన్నారు.

# నూతన ఎరువులను ఉత్పత్తి చేస్తున్న మున్నారో అగ్రో టెక్నాలజీ కంపెనీవారు




శంషాబాద్ (**గౌతమ్ న్యూస్** ): మున్నారో అగ్రో టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు సేంద్రియ మరియు సూక్ష్మ పోషక నీటిలో కరిగే ఎరువులను అందిస్తున్నారు. భారతదేశం నెలలో సేంద్రీయ గర్భణం తక్కువగా ఉండటం వల్ల మట్టిలో సూక్ష్మజీవులు తక్కువ ఉంటాయి కాబట్టి మట్టి నాణ్యత కోల్పోతుంది కాబట్టి ఈ కంపెనీ వాళ్ళు సేంద్రీయ ఎరువులను అందజేస్తున్నారు ఈ ఎరువు వాడటం వలన ఎకరానికి నాలుగు నుంచి ఐదు బ్యాగులు వాడితే మట్టిలోని నీటి సాంద్రత మరియు సూక్ష్మజీవులు పెరిగి దిగుబడి ఇస్తుందని అన్నారు. హైదరాబాదులోని రిసార్ట్ లో నర్మదా బయోకేమ్ లిమిటెడ్ డైరెక్టర్ శ్రీ హిమాలయ పటేల్ మండల ఉత్పత్తిని మార్కెట్లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మునారో అగ్రో టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో శ్రీ సి ఎస్ ఆర్ నాయుడు గారు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు ఈయన మాట్లాడుతూ మునారా వారి గోల్డ్ బ్లాక్ ద్రవరూప సేంద్రియ ఎరువు పంటలపై పిచికారి చేసిన ఎడల పంట నాణ్యత దిగుబడి పెరుగుతుందని అన్నారు ఈ సేంద్రియ ఎరువుని నిరంతరం రైతులకు అందుబాటులోకి ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో సి ఎస్ ఆర్ నాయుడు సీఈఓ మునార ఆగ్రో హిమాలయ పటేల్ డైరెక్టర్ శ్రీ నర్మదా బయోకేమ్ లిమిటెడ్ జె ఎస్ మూర్తి డైరెక్టర్ మునారా ఆగ్రో ప్రఫుల్ బిజినెస్ హెడ్ మునారా ఆగ్రో తదితరులు పాల్గొన్నారు

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మోకుదెబ్బ నాయకులు రమేష్ గౌడ్



నర్సంపేట(**గౌతమ్ న్యూస్** ): నల్లబెల్లి మండలం శనిగరం గ్రామం లో ఇటీవల మరణించిన మృతుల కుటుంబ సభ్యులను గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ తెలంగాణా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ పరామర్శించటం జరిగింది. అనారోగ్యంతో ఇటీవల మరణించిన కక్కేర్ల బుచ్చయ్య గౌడ్ కుటుంబ సభ్యులను, గ్రామ బీఆర్ఎస్ నాయకులు కక్కేర్ల గోపి గౌడ్ కూతురు రేష్మ అనారోగ్యంతో మరణించగా వారిని మాజీ ఎంపీపీకక్కేర్ల శ్రీనివాస్ గౌడ్,తాళ్లపెల్లి సురేష్ గౌడ్, గిరగాని నర్సయ్య గౌడ్. లు కక్కేర్ల రాజు గౌడ్, సుమన్ గౌడ్ లను పరామర్శించడం జరిగింది. అలాగే మేడపల్లి కి చెందిన గండి నర్సయ్య గౌడ్ సతీమణి సంధ్యారాణి సంహాత్సరీకంలో పాల్గొని వారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది.ఈ కార్యక్రమం లో గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు గండి లింగయ్య గౌడ్, మాచర్ల ఐలుమల్లు గౌడ్, తాళ్లపెల్లి చంద్రమౌళి గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీహరి గౌడ్, గిరి గౌడ్,పొగాకు రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కీశే. సంధ్యారాణి కి గౌడ సంఘం నాయకులు నివాళులు



నర్సంపేట(**గౌతమ్ న్యూస్** ): రిటైర్డ్ టీచర్ గండి నర్సయ్య గౌడ్ సతీమణి సంధ్యారాణి ప్రథమ వర్ధంతి కార్యక్రమం బుధవారం జరిగింది. మొదట కీశే. సంధ్యారాణి చిత్ర పటానికి గౌడ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండి లింగయ్య గౌడ్, రామగోని సుధాకర్ గౌడ్, అనంతుల రమేష్ గౌడ్, వేముల సాంబయ్య గౌడ్, వళ్ళాల శ్రీహరి గౌడ్, గండి గిరి గౌడ్, నాంపల్లి వెంకట్ గౌడ్, గండి సంతోష్ గౌడ్, పొగాకు రమేష్ గౌడ్, శంకర్ గౌడ్, ఉదయ్, కిషోర్, సురేష్, చంద్రమౌళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన అఖిలేష్ యాదవ్..



సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) చీఫ్, మాజీ యూపీ సీఎం అఖిలేష్ యాదవ్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఇటీవల ఎన్నికల్ల ఉత్తర్ ప్రదేశ్‌లోని కన్నౌజ్ ఎంపీ సీటు నుంచి భారీ మెజారిటీతో గెలిచిన అఖిలేష్, కర్హాల్ అసెంబ్లీ ఎమ్మెల్యే పదవికి బుధవారం రాజీనామా చేశారు. పార్టీ సీనియర్ నేత అవధేష్ ప్రసాద్ కూడా ఫైజాబాద్ నుంచి ఎంపీగా గెలిచిన తర్వాత తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. అఖిలేష్ తన రాజీనామా లేఖని శాసనసభ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రదీప్ దూబే కార్యాలయాలని పంపారు. అఖిలేష్ 2022 ఉత్తర్ ప్రదేశ్ ఎన్నికల్లో కర్హాల్ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. తదుపరి ప్రతిపక్ష నేత ఎవరనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే పార్టీకి మేలు జరిగేలా, పార్టీ ఓట్ల శాతాన్ని పెంచే విధంగా నిర్ణయం ఉంటుందని చెప్పారు. లోకసభ ఎన్నికల్లో ఎస్పీ సత్తా చాటింది. బీజేపీకి గత రెండు ఎన్నికల్లో కంచుకోటగా ఉన్న యూపీని అఖిలేష్ బద్ధలు కొట్టారు. మొత్తం 80 ఎంపీ సీట్లు ఉన్న ఆ రాష్ట్రంలో మాజ్‌వాదీ పార్టీ 37, బీజేపీ 33, కాంగ్రెస్ 6, రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్‌డీ) 2, ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరామ్), అప్నా దళ్ (సోనీలాల్) ఒక్కో సీటుగెలుచుకున్నాయి. అయోధ్య రామమందిరం ఉన్న ఫైజాబాద్‌లో కూడా బీజేపీ ఓటమి పాలైంది. ఈ స్థానం నుంచి ఎస్పీ అభ్యర్థి అవదేశ్ గెలుపొందారు.

## కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం.. 41 మంది సజీవదహనం



కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ ఎత్తైన భవనంలో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటనలో ఐదుగురు భారతీయులతో సహా 41 మంది సజీవదహనమయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కువైట్‌లోని దక్షిణ మంగాఫ్ జిల్లాలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. 41 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వ ఆధ్వర్యంలోని కువైట్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. బుధవారం తెల్లవారుజామున మంటలు చెలరేగడంతో భవనంలో మంటలు వ్యాపించాయి. మంటలు అంటుకుని భవనం అంతా వేగంగా వ్యాపించాయి. దీంతో చాలా మంది లోపలే చిక్కుకున్నారు. ఈ భవనంలో ఎక్కువగా కార్మికులు నివాసం ఉంటున్నట్లు తెలుస్తోంది. ప్రమాదంలో 41 మంది మృతి చెందారని.. మరో 43 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కువైట్ డిప్యూటీ ప్రధాని వెల్లడించారు. మృతుల్లో ఐదుగురు కేరళకు చెందిన వారు ఉన్నట్లుగా సమాచారం. ఈ ఘటనపై విదేశాంగ మంత్రి జైశంకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇక భారత రాయబార కార్యాలయం నుంచి కేంద్రమంత్రి సమాచారం సేకరిస్తున్నారు. మృతుల కుటుంబాలకు జై శంకర్ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని.. సహాయ అందిస్తామని కేంద్రమంత్రి పేర్కొన్నారు. "కువైట్ నగరంలో అగ్నిప్రమాద ఘటన వార్తతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. 40 మందికి పైగా మరణించారని మరియు 50 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారని తెలిసింది. తదుపరి సమాచారం కోసం మేము ఎదురుచూస్తున్నాం." అని జైశంకర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మరోవైపు రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అధికారులు దగ్గర ఉండి పరిస్థితుల్ని సమీక్షిస్తున్నారు. ఇక ప్రమాదానికి గల కారణాలపై కూడా దర్యాప్తు చేస్తున్నారు. భవనంలో పెద్ద ఎత్తున కార్మికులు ఉన్నారని.. పొగ పీల్చడం వల్లే మరణాల సంఖ్య పెరిగిందని సీనియర్ పోలీస్ కమాండర్ తెలిపారు.

### శాఖల కేటాయింపుపై చంద్రబాబు కసరత్తు..

## ఎవరెవరికి ఏయే శాఖలంటే

ఆంధ్రప్రదేశ్‌లో నూతన సర్కారు కొలువుదీరింది. మంత్రివర్గం ప్రమాణస్వీకారం ముగిసింది. కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు జరుపుకుంటున్నారు. కానీ ఇప్పుడు ఎవరెవరికి ఏయే శాఖలు కేటాయిస్తారనే అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. ప్రమాణ స్వీకారం అనంతరం సీఎం చంద్రబాబు తన నివాసానికి చేరుకున్నారు. ఈ క్రమంలోనే ఏపీ సీఎం చంద్రబాబు శాఖల కేటాయింపుపై కసరత్తు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఎవరెవరికి ఏయే శాఖలు కేటాయించాలనే అంశంపై తర్జన భర్జన జరగనుంది. పోలవరం, అమరావతి నిర్మాణాలకు చంద్రబాబు సర్కార్ హై ప్రయార్టీ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇరిగేషన్, పట్టణాభివృద్ధి శాఖల పరిధిలో పోలవరం, అమరావతి నిర్మాణాల వ్యవహారం ఉంటుంది. ఈ క్రమంలోనే ఈ కీలక శాఖలను ఎవరికి అప్పగిస్తారనే దానిపై చర్చ జరుగుతోంది. పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ కీలక శాఖలను ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. హెూం శాఖ పవన్‌కు వెళ్తుందనే విస్తృత ప్రచారం జరుగుతుండగా.. పరిశ్రమలు, స్కిల్ డెవలప్మెంట్, వ్యవసాయం, ఇంధన శాఖలపై టీడీపీ వద్దే ఉంటాయా..? లేక జనసేనకు వెళ్తుందా..? అనేది చర్చనీయాంశమైంది. ఓ వైపు లోకేష్‌కు విద్యాశాఖ అని ప్రచారం జరుగుతుండగా.. మరోవైపు గతంలోని శాఖలే కేటాయించవచ్చనే ప్రచారాలు జరుగుతున్నాయి. ఆర్థిక శాఖ పయ్యావులకు లేదా ఆనంకు కేటాయించే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. వంగలపూడి అనితకు కీలక శాఖలు కట్టబెట్టే అవకాశాలు కూడా లేకపోలేదని కూటమి కార్యకర్తల్లో చర్చ జరుగుతోంది. పట్టణాభివృద్ధిని నారాయణకు కట్టబెడతారా..? లేక సీఎం వద్దే ఉంచుకుంటారా..? అనే చర్చ విస్తృతంగా జరుగుతోంది. ఈ రోజు సాయంత్రం చంద్రబాబు తిరుమలకు వెళ్లనున్న సంగతి తెలిసిందే. ఈ లోపే శాఖలు కేటాయించే అవకాశం ఉంది. ఎవరికి ఏ శాఖలు కేటాయిస్తారో అధికారిక నిర్ణయం వచ్చేవరకు వేచి చూడాల్సిందే.

## నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి

### ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్



హైదరాబాద్ **(గౌతమ్ న్యూస్ ):** నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని, మళ్లీ ఎగ్జామ్ నిర్వహించాలని ఆర్టీఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14వ తేదీన రావాల్సిన నీట్ ఈ ఫలితాలను ఎన్నికల రిజల్ట్ రోజున హడావిడిగా విడుదల చేశారని ఆరోపించారు. నీట్లో ఆల్ ఇండియా స్థాయిలో 67 మంది ఫస్ట్ ర్యాంక్ సాధించారని, వారిలో మొత్తం 720 గాను 719, 718 మార్కులు సాధించారని, నీట్ చరిత్రలో ఇలాంటి ఫలితాలు ఎప్పుడు రాలేదన్నారు. అంతేగాకుండా ఒకే సెంటర్ నుంచి 8 మంది విద్యార్థులు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకులు సాధించారని, ఎగ్జామ్ నిర్వహణలో జరిగిన లోపాలకు ఇదే నిదర్శనమన్నారు. టెక్నికల్ సమస్యల వలన పరీక్షను లేట్గా నిర్వహించి, నిర్ణీత సమయంలోనే పరీక్ష ముగించారని, దీంతో సమయం కోల్పోయిన విద్యార్థులు కోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. హడావిడిగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బాధిత విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలుపుతామని ప్రకటించారని, దీనివలన మెరిట్ స్టూడెంట్స్ తీవ్రంగా నష్టపోయారన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడు తున్న ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) పై సీబీఐ విచారణ జరిపించాలని లేకుంటే ఆర్టీఐ ఇండియా నేతృత్వంలో ఆందోళనలు చేపడుతామని చంటి ముదిరాజ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సూర స్రవంతి, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రాజు, నమిండ్ల హరీష్, సాదబోయిన రాజు, అక్కెల్లి పవన్ కళ్యాణ్, కార్తీక్, ప్రవీణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ మంత్రి వర్గంలో నేరచరితులు..

### 28మంది మంత్రులపై క్రిమినల్ కేసులు- అత్యంత సంపన్నుడిగా పెమ్మసాని

న్యూఢిల్లీ :కేంద్రంలో కొత్తగా కొలువుతీరిన మోడీ మంత్రివర్గంలో 28 మందిపై క్రిమినల్ కేసులున్నాయి. ఇందులో 19 మంది హత్యాయత్నం, మహిళలపై నేరాలు, విద్వేష ప్రసంగాలు.. వంటి తీవ్రమైన అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాలను ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. ఇద్దరు మంత్రులు ఐపీసీ సెక్షన్ 307 కింద హత్యాయత్నం ఆరోపణలున్నాయి. నౌకాశ్రయాలు, షిప్పింగ్, జలమార్గాల శాఖ సహాయ మంత్రి శంతను ఠాకూర్, విద్యా శాఖ, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సుకంత మజుందర్పై ఈ కేసులున్నాయి. హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజరుకుమార్, ఠాకూర్, మజుందర్, పెట్రోలియం, సహజవాయువులు, టూరిజం శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి, గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జౌల్ ఓరంలు మహిళలపై వేధింపుల కేసులు ఎదుర్కొంటున్నారు. ఎనిమిది మంది మంత్రులపై విద్వేష ప్రసంగాల కేసులున్నాయని ఏడీఆర్ తెలిపింది. మొత్తం 71 మంత్రుల్లో 28 మంది (39 శాతం)పై క్రిమినల్ కేసులున్నాయని వెల్లడించింది.

### 99 శాతం కేంద్ర మంత్రులు కోటీశ్వరులు

ప్రధాని మోడీ కొత్త మంత్రివర్గంలోని 71 మంది మంత్రుల్లో 70 మంది (99 శాతం) కోటీశ్వరులే ఉన్నారు. 71 మంది మంత్రుల సగటు ఆస్తులు రూ.107.94 కోట్లు. ఆరుగురు మంత్రులకు రూ.100 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. మోడీ నేతృత్వంలోని కొత్త మంత్రివర్గంలో బీజేపీ నుంచి 61 మంది, ఎన్డీఏ మిత్రపక్షాల నుంచి 11 మంది మంత్రులు ఉన్నారు. 72 మంది



మంత్రుల్లో 43 మంది మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు ఎంపీలుగా ఎన్నికయ్యారు. 39 మంది గతంలో కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్నారు.

### పెమ్మసానే సంపన్నుడు

మోడీ మంత్రివర్గంలో అత్యంత ధనిక మంత్రిగా టీడీపీ నుంచి లోక్సభకు ఎన్నికైన పెమ్మసాని చంద్రశేఖర్ నిలిచారు. ఆయనను గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖకు సహాయ మంత్రిగా నియమించారు. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా రెండో స్థానం, మూడో స్థానంలో ఉన్న హెచ్ డి కుమారస్వామి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రిగా నియమితులయ్యారు. అశ్విని వైష్ణవ్ రైల్వే, ఐ అండ్ బీ, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రిగా ఉన్నారు. ఐదో స్థానంలో ఉన్న పీయూష్ గోయల్ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నారు. లోక్సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందు దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా ఈ మంత్రుల ఆస్తులను ఏడీఆర్ లెక్కించింది. 71 మంది కేంద్ర మంత్రుల్లో 47 (66 శాతం) మంది కొత్తవారు కాగా, వారి వయస్సు 51-71 మధ్య ఉంది. 11 మంది ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించగా, 57 మంది గ్రాడ్యుయేషన్, ఆపై చదివారు.

# ఆ తేడా ఎందుకు వచ్చిందో...

### పోలైన, లెక్కించిన ఓట్ల మధ్య వ్యత్యాసాలు- 362 స్థానాల్లో లెక్కకు రాని ఐదున్నర లక్షల ఓట్లు
### 176 స్థానాల్లో మిగులు ఓట్లు నమోదు

న్యూఢిల్లీ :లోక్సభ ఎన్నికలు ముగిసి కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. అయితే అనేక లోక్సభ స్థానాల్లో ఈవీఎంల్లో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య వ్యత్యాసాలు కన్పిస్తున్నాయి. 362 స్థానాల్లో అక్షరాలా 5,54,598 ఓట్ల తేడా కన్పించింది. అంతేకాదు 176 నియోజకవర్గాల్లో ఈవీఎంల్లో అదనంగా 35,093 ఓట్లు నమోదయ్యాయని ఎన్నికల కమిషన్ గుర్తించింది. ఓటింగ్కు సంబంధించి ఎన్నికల కమిషన్ విడుదల చేసిన రెండు రకాల సమాచారాలను 'ది క్వింట్' పోర్టల్ విశ్లేషించింది. మొదటిది పోలైన ఓట్లు. రెండోది ఫలితాల రోజు లెక్కించిన ఓట్లు. లోక్సభలో మొత్తం 542 స్థానాలు ఉండగా ఏకంగా 538 చోట్ల సమాచారాల మధ్య వ్యత్యాసం కన్పించింది. ఈవీఎంల్లో పడిన ఓట్లు, ఫలితాల రోజు లెక్కించిన ఓట్ల మధ్య స్పష్టమైన తేడా ఉందని 'ది క్వింట్' పోర్టల్ గుర్తించింది.కనీసం 267 నియోజకవర్గాల్లో ఈ వ్యత్యాసం 500 ఓట్ల కంటే ఎక్కువగానే కన్పించింది. ఉదాహరణకు తమిళనాడులోని తిరువల్లూర్ స్థానంలో ఈవీఎంల్లో 14,30,738 ఓట్లు పోలయ్యాయి. కానీ ఫలితాల రోజు 14,13,947 ఓట్లను మాత్రమే లెక్కించారు. అంటే 16,791 ఓట్ల తేడా వచ్చింది. ఇలా ఎందుకు జరిగిందనే విషయంపై ఎన్నికల కమిషన్ ఎలాంటి వివరణ ఇవ్వలేదు. అయితే మాక్ పోలింగ్ డాటాను కంట్రోల్ యూనిట్ నుండి తొలగించకుండా ప్రిసైడింగ్ అధికారులు అసలైన పోలింగ్ను ప్రారంభిస్తే ఓట్లలో వ్యత్యాసం వస్తుందని ఉత్తరప్రదేశ్ ఎన్నికల అధికారి తెలిపారు. ప్రిసైడింగ్ అధికారి పోలైన ఓట్లను ఫారం 17-సీలో తప్పుగా నమోదు చేసినా ఇలా జరుగుతుందని ఆయన వివరణ ఇచ్చారు.




### లెక్కించిన ఓట్లే అధికం

కారణం ఏదైనప్పటికీ పలు నియోజకవర్గాల్లో ఈవీఎంల్లో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య తేడాలు కన్పించాయి. అసోంలోని కరింగంజ్లో 3,811 ఓట్లు, ఆంధ్రప్రదేశ్లోని ఒంగోలులో 1,467 ఓట్లు, ఒడిషాలోని బాలాసోర్లో 1,173 ఓట్లు, మధ్యప్రదేశ్లోని మాండ్లాలో 1,089 ఓట్లు, బీహార్లోని బక్సర్ స్థానంలో 1,010 ఓట్ల వ్యత్యాసం ఉంది. ఈ స్థానాలన్నింటిలోనూ ఈవీఎంల్లో పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లే అధికారంగా ఉన్నాయి.

### అక్కడ ఈవీఎం ఓట్లే అధికం

ఈవీఎంల్లో పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లు తక్కువగా ఉన్న నియోజకవర్గాలు కూడా ఉన్నాయి. తమిళనాడులోని తిరువల్లూరులో 16,791, అసోంలోని కోక్రార్ఝూర్లో 10,760, ఒడిషాలోని ధెన్కానాల్లో 9,427, కేరళలోని అలప్పుజాలో 7,928, ఆంధ్రప్రదేశ్లోని గుంటూరులో 7,928 ఓట్లు ఈ విధంగా తక్కువగా లెక్కింపుకు వచ్చాయి.

### సుప్రీంకోర్టు ఏం చెప్పింది?


2019 ఎన్నికల్లో కూడా ఈవీఎం ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య వ్యత్యాసాలు బయటపడ్డాయి. దీనిపై ఏడీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. వాస్తవమైన, కచ్చితమైన ఓటింగ్ సమాచారాన్ని సరిపోల్చుకున్న తర్వాతే తుది ఫలితాన్ని ప్రకటించేలా ఎన్నికల కమిషన్ను ఆదేశించాలని ఆ పిటిషన్లో కోరింది. ఈవీఎంలో పడిన ఓట్లను వీవీపాట్ స్లిప్పులతో సరిపోల్చుకోవాలంటూ దాఖలైన పలు పిటిషన్లను సుప్రీంకోర్టు ఏప్రిల్ 26న తోసిపుచ్చింది. తాము నాలుగు కోట్ల స్లిప్పులను వెరిఫై చేశామని, ఎక్కడా తేడా రాలేదని ఎన్నికల కమిషన్ సుప్రీంకోర్టుకు నివేదించిన తర్వాత ఈ తీర్పు వెలువడింది.

### ఈసీ వివరణ కోరుతున్న ప్రజలు

ఈవీఎంలో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య వ్యత్యాసం ఉంటే ప్రజల మనసుల్లో అనుమానాలు ఏర్పడతాయని ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం కృషి చేస్తున్న అంజలి భరద్వాజ్ తెలిపారు. ఎన్నికల ఫలితాలకు సంబంధించిన పార్ట్-2 సహా ఫారం 17-సీని పూర్తిగా పబ్లిక్ డొమైన్లో ఉంచితే అనుమానాలకు ఆస్కారం ఉండదని చెప్పారు. పోలైన ఓట్లకు సంబంధించిన సమాచారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లో కన్పిస్తుందని, కాబట్టి సాంకేతికంగా చూస్తే వ్యత్యాసం రాకూడదని, అయినప్పటికీ వస్తే నియోజకవర్గాల వారీగా కమిషన్ వివరణ ఇవ్వాలని ఆమె సూచించారు.

# 7 తెలంగాణ మండలాలిస్తేనే ప్రమాణం చేశా

### నా ఒత్తిడితోనే మోదీ ఆగమేఘాలపై ముంపు మండలాల ఆర్డినెన్స్ తెచ్చారు
### మోదీ- బాబు మిలాఖత్ మరోసారిబట్టబయలు
### లేకపోతే సీఎంగా ప్రమాణం చేయబోనని చెప్పా
### 2014నాటి విషయాన్ని వెల్లడించిన చంద్రబాబు
### 'పురిటి బిడ్డ' నుంచి మండలాలు లాగేసిన ప్రధాని
### టీడీపీతో సఖ్యత కోసం తెలంగాణకు అన్యాయం
### బాబు నోటి వెంటే అసలు వాస్తవం బయటకు
### మండలాల్ని వెనక్కి తెస్తామంటూ మ్యానిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు బాబు మాటపై మౌనం



హైదరాబాద్, : తెలంగాణలోని ఏడు మండలాలను ఇస్తేనే, తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తానని చెప్పడం వల్లనే.. 2014లో మోదీ ప్రభుత్వం వాటిని ఏపీలో విలీనం చేసిందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబు మంగళవారం అమరావతిలో నిర్వహించిన టీడీపీఎల్పీ సమావేశంలో ఆనాటి కుట్ర కోణాన్ని బయటపెట్టారు. 2014లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తాను, ప్రధానిగా నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చామని గుర్తుచేశారు. అయితే, నాడు పోలవరం ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీకి ఇస్తే తప్ప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోనని స్పష్టంచేశానని తెలిపారు. దీంతో మోదీ ప్రభుత్వం మొదటి క్యాబినెట్ మీటింగ్‌లోనే ఆ ఏడు మండలాలను ఏపీలో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకున్నదని, ఆర్డినెన్స్ జారీ చేసిందని వెల్లడించారు. ఇప్పటి మాదిరిగానే పదేండ్ల క్రితం 2014లో బీజేపీతో పొత్తుపెట్టుకున్న చంద్రబాబు ఏపీలో అధికారంలోకి వచ్చారు. నాడు కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయేలో టీడీపీ భాగస్వామ్యపక్షంగా కొనసాగింది. ఈ నేపథ్యంలోనే ఎన్డీయే ప్రభుత్వం 2014 జులై 11న ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకణ చట్ట సవరణకు ఆర్డినెన్స్ ద్వారా బిల్లు ప్రవేశపెట్టి, తెలంగాణకు చెందిన ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసిన సంగతి తెలిసిందే. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం, పాల్వంచ రెవెన్యూ డివిజన్ల పరధిలోని ఏడు మండలాలను ఏపీకి ధారాదత్తం చేసింది. ఈ చర్యను నాడు తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాడు తెలంగాణ ప్రజలు రాష్ట్రవ్యాప్తంగా బంద్ పాటించి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిఘటించారు. ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆమండలాలను తిరిగి ఇవ్వాలని నాటి సీఎం కేసీఆర్ స్వయంగా ప్రధాని మోదీని కలిసి ఎన్నిసార్లు విన్నవించుకున్నా, పట్టించుకున్న పా పాన పోలేదు. తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన ఏడు మండలాలను తిరిగి తెలంగాణలో కలుపుతామని కాంగ్రెస్ మొన్నటి పార్లమెంట్ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. ఏడు మండలాల విలీనం విషయంలో కేంద్రంలోని బీజేపీ, ఏపీలోని టీడీపీ కలిసి చేసిన కుట్రను చంద్రబాబు స్వయంగా బయట పెట్టినప్పటికీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభు త్వం కానీ, ఆ పార్టీ నేతలు గానీ నోరు విప్పక పోవ డం గమనార్హం. తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన ఏపీ టీడీపీ ప్రభుత్వం చేయబోయే ప్రమాణ స్వీకారానికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ పెద్ద వెళ్తా రా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్డీ యేలో కీలక భాగస్వామిగా ఉన్న చంద్రబాబు తెలంగాణకు వ్యతిరేకంగా మరెన్ని కుట్రలు చేస్తారోనన్న ఆందోళన తెలంగాణవాదుల్లో వ్యక్తమవుతున్నది. 'రాష్ట్రానికి అతి ముఖ్యమైన ప్రాజెక్టు పోలవరం. నాకు ఇప్పటికీ జ్ఞాపకం ఉన్నది. నేను 2014లో ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యాను. పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురయ్యే ఏడు మండలాలు తెలంగాణలో ఉన్నాయి. తెలంగాణ అనుమతి ఉంటే తప్ప, పునరావాసానికి ఒప్పుకుంటే తప్ప పోలవరం కట్టే పరిస్థితి లేదు. ఆరోజు రాజ్‌నాథ్‌సింగ్ బీజేపీ అధ్యక్షుడు, వెంకయ్యనాయుడు కూడా అప్పుడు యాక్టివ్‌గా ఉన్నారు. ఆ ఏడు మండలాలు ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తే తప్ప ప్రాజెక్టు పూర్తి కాదు. ఏడు మండలాలు ఇవ్వకపోతే నేను ప్రమాణ స్వీకారం చేయను. నాకీ పదవి వద్దు అని స్పష్టంగా చెప్పాను. ఆ రోజు ప్రధాని నరేంద్రమోదీ ఇవన్నీ ఆలోచించి, ఫస్ట్ క్యాబినెట్ మీటింగ్‌లో పెట్టి, ఒక ఆర్డినెన్స్ ఇచ్చి ఆ ఏడు మండలాలు ఆంధ్రప్రదేశ్‌కి ఇచ్చి, ఆ తర్వాత పార్లమెంట్ సమావేశాలు పెట్టుకున్నారంటే అదొక చరిత్ర'.

గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక



# నేను ఎటూ తేల్చుకోలేకపోతున్నా



ఇంటర్నెట్‌డెస్క్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓ అంశంలో ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. ఆయన ఈసారి పోటీచేసిన వయనాడ్ (కేరళ), రాయ్‌బరేలీ (యూపీ)లో ప్రజలు ఆయన్ను మంచి మెజార్టీతో గెలిపించారు. దీంతో ఆయన ఇప్పుడు ఒక నియోజకవర్గాన్ని వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈవిషయంపై రాహుల్ బుధవారం స్పందించారు. తాను ఎటువైపు మొగ్గాలో తేల్చుకోలేకపోతున్నట్లు వెల్లడించారు. ఏ నిర్ణయం తీసుకొన్నా రెండు నియోజకవర్గాలు సంతోషంగా అంగీకరిస్తాయన్నారు. ఆయన కేరళలోని మల్లప్పురంలో జరిగిన ఓ ర్యాలీలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు, వయనాడు ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. "నేను ఓ విషయంలో ఎటూ తేల్చుకోలేకపోతున్నాను. ఏమైనా కానీ.. వయనాడ్ లేదా రాయ్‌బరేలీలో ఒక దానికే నేను ఎంపీగా ఉండాలి. నా నిర్ణయంతో రెండు నియోజకవర్గాలు హ్యాపీగా ఉండాలని కోరుకుంటున్నాను" అని వ్యాఖ్యానించారు. ఈసందర్భంగా ప్రధాని మోదీ తీరును తప్పుపట్టారు. దేశంలో విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు అదానీకి అప్పగించాలని దేవుడు ఆదేశించారా అని ఎద్దేవా చేశారు. తాను మాత్రం మానవమాత్రుడినేనని తెలిపారు. తనకు పేదలు, దేశమే దైవమని చెప్పారు. తాను ఏం చేయాలో వారే చెబుతారన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధాని మోదీ తన వైఖరిని మార్చుకోవాల్సిందేనన్నారు. ఈమేరకు ప్రజలు ఆయనకు స్పష్టమైన సందేశం పంపారని వ్యాఖ్యానించారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం అనంతరం తొలిసారి ఆయన కేరళను సందర్శించారు. ఈ రాష్ట్రం నుంచి రెండోసారి భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఎన్నికల ప్రచార సమయంలో తాను రాజ్యాంగ రక్షణకు పోరాడుతున్నట్లు రాహుల్ వెల్లడించారు. ఏదోఒక నియోజకవర్గాన్ని వదులుకొనే అంశంపై శనివారం దిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో తన అభిప్రాయాన్ని పార్టీ అధిష్ఠానానికి రాహుల్ తెలిపినట్లు తెలుస్తోంది. దీనిపై జూన్ 17న అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. 2019 ఎన్నికల్లో యూపీలోని అమేఠీ స్థానంలో కేంద్ర మంత్రి స్మృతిఇరానీ చేతిలో ఓడిపోయిన రాహుల్.. కేరళలోని వయనాడ్ నుంచి గెలుపొందిన విషయం తెలిసిందే. ఈసారి ఎన్నికల్లో వయనాడ్‌తోపాటు రాయ్‌బరేలీలోను రాహుల్ పోటీ చేశారు. అమేఠీ, రాయ్‌బరేలీల్లో కాంగ్రెస్ గెలుపొంది తన కంచుకోటలను కాపాడుకుంది. రాహుల్ ఇప్పుడొక అంశంపై తీవ్రంగా ఆలోచిస్తున్నారు. మంచి మెజార్టీతో గెలిపించిన రెండు నియోజకవర్గాల్లో దేనిని వదులుకోవాలో తేల్చుకోలేకపోతున్నారు.

# మొదటి 6 నెలల్లో చంద్రబాబు టార్గెట్... అది ఫినిష్?




తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. చంద్రబాబుతో పాటు మంత్రిగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రమాణ్, నాదెండ్ల మనోహర్, నారా లోకేష్, కందుల దుర్గేష్, మండిపల్లి రాంప్రసాద్, కొండపల్లి శ్రీనివాస్, వాసంపట్టి సుభాస్ పలువురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ప్రధానమంత్రి మోడీని.. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి పవన్ కల్యాణ్ శాలువా కప్పి జ్ఞాపికను బహుకరించారు. తెలుగుదేశం పార్టీ కూటమిని చంద్రబాబునాయుడు అత్యంత మెజారిటీతో గెలిపించారు. అందుకు కారణం మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలే అని ఆయన భావిస్తున్నారు. మొదటి ఆరునెలల్లో ఎటువంటి పనులు పెట్టుకోకుండా వీటిని పూర్తిచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం కూటమి మేనిఫెస్టోలో పెట్టిన సూపర్ సిక్స్ ను ఆరునెలల్లోపు అమలు చేయనున్నారు. దీనికి సంబంధించిన వార్త సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ఏమిటనేది ఓసారి పరిశీలిద్దాం. 1. యువతకు ఐదు సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగ అవకాశాలు (వారికి రూ.3వేల నిరుద్యోగ భృతి) 2. పాఠశాలకు వెళ్లే విద్యార్థినికి ఏటా రూ.15వేలు 3. ప్రతి రైతులకు వ్యవసాయం చేయడానికి పెట్టుబడి కింద ఏటా రూ.20వేల నగదు 4. ప్రతి ఇంటికి ఏడాదిలో ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు 5. ప్రతి మహిళకు నెలకు రూ.1500 6. మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం తెలంగాణలో ఇప్పటికే ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతోంది. బస్సులు కిక్కిరిసి నడుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడినుంచి ఎక్కడికైనా బస్సులో మహిళలు తమ ఆధార్ కార్డు చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ఏపీలో కూడా మహిళలు అలాగే ప్రయాణం చేయబోతున్నారు. ఆధార్ కార్డు (ఏపీలోని అడ్రస్ ఉండాలి) చూపించి ఉచిత ప్రయాణం చేయడంద్వారా తమ ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకుంటారని భావిస్తున్నారు.

# మధ్యప్రదేశ్‌లో కలరా కలకలం..
# ఇద్దరు మృతి, 80 మందికి అస్వస్థత



మధ్యప్రదేశ్‌లోని భింద్ జిల్లాలో కలరా వ్యాప్తి కలకలం రేపుతుంది. ఈ వ్యాధితో ఇద్దరు వృద్ధులు మరణించారు. 80 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారని ఆరోగ్య అధికారి బుధవారం తెలిపారు. జిల్లాలోని ఫూప్ టౌన్‌లోని వార్డు నంబర్ 5, 6, 7లో నీరు కలుషితం కావడంతో ఈ వ్యాధి వ్యాప్తి చెందిందని పేర్కొన్నారు. చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ (, భింద్) శర్మ మీడియాతో మాట్లాడుతూ.. "నీటిలో ఇన్ఫెక్షన్ కారణంగా, కలరా వ్యాప్తికి సంబంధించిన కొన్ని కేసులు నమోదయ్యాయి, ఆ తర్వాత కొంతమంది రోగులు జిల్లా ఆసుపత్రిలో చేరారు. వారిలో కొంతమంది స్థానిక కమ్యూనిటీ హెల్త్‌లో చికిత్స పొందారు. ఇప్పటి వరకు మొత్తం 84 మంది రోగులు కోలుకొని ఇంటికి తిరిగి వచ్చారు. కలరాతో ఇద్దరు వృద్ధులు మరణించారు" అని సీఎంహెచ్‌వో తెలిపారు. నగరంలో ప్రస్తుతం తాగునీటి సరఫరాను బంద్ చేసి ఇతర మార్గాల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభావిత ప్రాంతంలోని ఇంటిని మొత్తం సర్వే చేసి మందులు, క్లోరిన్ మాత్రలు అందజేశాం.. నీటిని మరిగించిన తర్వాతే తాగాలని ప్రజలకు సూచించినట్లు చెప్పారు. అంతే కాకుండా ఎక్కడైనా నీటి కలుషితాన్ని తొలగించాలని నగర్ పాలికకు చెప్పినట్లు సీఎంహెచ్‌వో పేర్కొన్నారు. కేవలం కలుషిత నీటి కారణంగానే కలరా వ్యాప్తి జరిగిందని, ఒకసారి శాంపిల్‌ను పరీక్షించి చూస్తే అసలు విషయం స్పష్టమవుతుందని సీఎంహెచ్‌వో శర్మ తెలిపారు. మరోవైపు.. అంబులెన్స్‌లు ఏర్పాట్లు చేశామని, వైద్యుల బృందాన్ని కూడా పెంచామని, ఈ విషయాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.ఽ

# సంచలన నిర్ణయం తీసుకున్న లక్ష్మీపార్వతి



నందమూరి తారకరామారావు సతీమణి లక్ష్మీపార్వతి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఏపీ తెలుగు అకాడమి చైర్ పర్సన్‌గా పని చేస్తున్న ఆమె తన పదవికి రాజీనామా చేశారు. ఈ రాజీనామా లేఖను ప్రభుత్వానికి పంపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఈ రోజు ప్రమాణ స్వీకారం చేయడంతో కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ప్రభుత్వం మారడంతో లక్ష్మీపార్వతి రాజీనామా చేశారు. గత ప్రభుత్వంలో లక్ష్మీపార్వతిని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తెలుగు అకాడమీ చైర్మన్‌ను చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆ పదవికి రాజీనామా చేశారు. గత ప్రభుత్వంలో నామినేటెట్ పదవులు దక్కించుకున్న నేతలు రాజీనామా చేస్తున్నారు. ఇప్పటికే పలువురు రాజీనామా చేశారు. అనంతపురంలో ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్ పాలకవర్గాలు కూడా రాజీనామా చేశాయి. కొత్త ప్రభుత్వం రావడంతో సొసైటీల ప్రతినిధులు, పాలకవర్గాలు వెంటనే రాజీనామాలు సమర్పించాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన పరిపాలన కార్యదర్శి సురేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

# పిచ్చుక మీదనా బ్రహ్మాస్త్రం



"పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం" అనే జాతీయం ఉంది. అతి తక్కువ బలం ఉన్నప్రాణి మీద అనవసరంగా అతి పెద్ద బలప్రయోగం చేయటం అనే అర్థంలో ఉపయోగిస్తారు. ఎంత చిన్నప్రాణి అయినా దాని అస్తిత్వం నిరుపయోగం కాదు. విశ్వంలో, ముఖ్యంగా భూగోళంలో, ప్రధానంగా అది ఉండే ప్రాంతంలో అది పోషించవలసిన పాత్ర ఒకటి ఉండనే ఉంటుంది. పర్యావరణ పరిరక్షణ, తద్వారా పర్యావరణ సమతౌల్యత ఉంటాయి. దానికి భంగం కలిగిస్తే పర్యవసానం అనుభవించ వలసి ఉంటుంది. ఒక పిచ్చుక సంవత్సరంలో 6.5 కిలోల బియ్యం తింటుంది అని చైనాలో ఒకప్పుడు చేపట్టిన సర్వే తెలిపింది. మొత్తం పిచ్చుకలు లేకుండా చేయగలిగితే 60 వేల మందికి ఆహారం లభిస్తుంది అని కూడా తెలిపింది. ఇంకేముంది? అసలే అధిక జనాభా సమస్య ఉన్న చైనా, వీలైనంత మందికి ఆహారం అందించటానికి ఇదొక మార్గం అనుకుని పిచ్చుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టింది. 30 లక్షల పిచ్చుకలని చంపారు. 1958 – 61 సంవత్సరాల మధ్య చైనాలో తీవ్రమైన కరవు వచ్చింది. సుమారుగా నాలుగు కోట్ల యాభై వేల మంది చనిపోయారు. కారణం ఏమై ఉంటుంది అని విచారణ చేస్తే పిచ్చుకలు లేక పోవటం వల్ల అని తేలింది. అదెట్లా? పిచ్చుకలు ధాన్యం తినటంతోపాటు పంటలని నాశనం చేసే పురుగులని కూడా తింటాయి. చీడ పురుగులని తినే పిచ్చుకలు లేక పోవటంతో పంటలకి చీడ పట్టి, తెగులు సోకి ధాన్యం దిగుబడి గణనీయంగా తగ్గింది. అది రాను రాను పెరిగింది. ప్రజలు తిండి లేక చనిపోయారు. దీనికి పరిష్కారం పంటలని నాశనం చేసే తెగుళ్లు కలిగించే పురుగులని రసాయన పదార్థాలు వాడ నవసరం లేకుండా తినేసే పిచ్చుకలు ఉండేట్టు చేయటమే అని నిర్ధారించారు. చేసేది ఏమీ లేక పిచ్చుకలని దిగుమతి చేసుకోవాలనుకున్నారు. రష్యా నుండి పిచ్చుకలని దిగుమతి చేసుకున్నారు. పరిస్థితి అదుపు లోకి వచ్చింది. ఇటువంటి శాస్త్రీయమైన విషయాలని మన దేశంలో ఒక ఆనవాయితీగా, ఆచారంగా చేయటం అలవాటు. భారతదేశంలో, ముఖ్యంగా తెలుగువారు వరికంకులని కుచ్చుగా అల్లి ఇంటి ముందు వేలాడ దీసే వారు. పిచ్చుకలు వచ్చి ఒక్కొక్క వడ్లగింజని తీసుకు వెళ్లేవి. అది రైతు పురుగులని తిని చీడ పీడల నుండి పంటని రక్షించిన పిచ్చుక పట్ల చూపించే కతజ్ఞత. ఇంటి ముందు కొన్ని గింజలు చల్లటం అలవాటు. ఆ అవకాశం ఉన్నా, లేక పోయినా ప్రతి రోజు పక్షులకి, ప్రత్యేకంగా కాకికి తినబోయే ముందు ఒక ముద్ద పెట్టటం అలవాటు. కాకి పరిసరాల్లో ఉన్న చెత్తని, చిన్న చిన్న పురుగులని తిని శుభ్రం చేస్తుంది. దేవాలయాలలో కూడా బలిహరణం అన్న పేరుతో నాలుగు దిక్కుల అన్నం ఉంచటం సంప్రదాయం. ఇంటి చూరులో పిచ్చుక గూడు పెడితే పరమానందం. ఆ గూట్లో పెట్టిన గుడ్లను పిల్లి తినకుండా కాపలా కాయటం ఒక సరదా. అవి ఉండే ప్రదేశాలని మనం ఆక్రమించి, చెట్లని నరికి వాటికి ఆహారం లేకుండా చేసినందుకు ఈ మాత్రం చేయక పోతే కృతఘ్నులం అవుతాం. అలాగని పిల్లులని పూర్తిగా తరమం. పిల్లి తిరుగుతుంటే ఆ వాసనకి ఎలుకలు విజృంభించవు. సృష్టిలో ప్రయోజనం లేని జీవి ఒక్కటి కూడా లేదు. గుర్తించక పోవటం మన లోపం. జాగ్రత్తగా గమనిస్తే ఇతర జీవులని, ప్రకృతిని స్వార్థానికి వాడుకుని ఎవరికీ ఉపయోగ పడని ప్రాణి మానవుడొక్కడే నేమో అనిపిస్తుంది. కనీసం పిచ్చుక పాటి అయినా చేయవద్దా?

# సానుకూల దృక్పథం



అంతా మన మంచికే అనే మంత్రిగారి కథ అందరికీ తెలిసినదే. "అంతా మన మంచికే" అనే మంత్రిగారు రాజుగారి చిటికెనవేలు తెగితే కూడా అదే మాట అని చెరసాల ?లు అయ్యారు. వేటకి వెళ్ళిన రాజుని ఆటవిక జాతివారు తమ దేవతకు బలి ఇవ్వబోయారు. చిటికెనవేలు లేక?వటంతో అంగవైకల్యం ఉన్న వ్యక్తి బలికి పనికి రాడు అని వదిలి పెట్టారు. రాజు తిరిగి వచ్చి మంత్రిని విడుదల చేసి, "నాకు మీ రన్నట్టు మంచే జరిగింది, మీకు ఏం మంచి జరిగింది?" అని అడిగాడు. అందుకు మంత్రి "అది కూడా నా మంచికే జరిగింది. చెరసాలలో లేక?తే తప్పకుండా మీతో వేటకి వచ్చే వాడిని. అంగవైకల్యం ఉన్న మిమ్మల్ని వదిలేసి అప్పుడు ఏ అవయవ లోపమూ లేని నన్ను బలి ఇచ్చేవారు" అని చె?డు. ఇది అతి మామూలు కథ. కానీ, దేనినైనా సానుకూల దృక్పథంతో ఎట్లా చూడాలి, దాని వల్ల ప్రయోజనం ఏమిటి? అన్న విషయాలు అర్థం అవుతాయి. కొన్ని ఆ క్షణాన ఇబ్బంది కలిగించేవిగా, అయిష్టంగా అనిపించ వచ్చు. కానీ, మనకి ఏది మంచో మనకన్నా ప్రకృతికే బాగా తెలుసు. ఆ ప్రకృతినే విశ్వం అని, దైవం అని, ఎనర్జీ అని రక రకాల పేర్లతో పిలుస్తూ ఉంటారు. వేసవి కాలంలో ఎటువంటి పళ్ళు, కూరలు ఆరోగ్యానికి మంచివో వాటినే ఇస్తుంది ప్రకృతి. వర్షాకాలంలో మామిడిపళ్ళు తినాలి అనిపించినా దొరకవు. ఎందుకో తెలుసా? ఆ వాతావరణానికి మామిడిపండు తినటం ఆరోగ్యానికి మంచిది కాదు. దొరికితే మామిడిపండు తినకుండా ఉండలేం. మన మంచికోసం దొరక కుండా చేసింది ప్రకృతి. ఈ దృక్పథం అలవాటయిన వారికి జీవితం కష్టాలమయంగా కనిపించదు. దేనినైనా తేలికగా తీసుకొని ముందుకి సాగటం ఉంటుంది. అట్లా అయితే వారి జీవితాల్లో కష్టాలు ఉండవా? ఉంటాయి, కానీ కన్నీళ్ళు ఉండవు. కష్టపడకుండా ఏదీ లభించదు. అది భౌతికమైనది. దాన్ని ఏదోవిధంగా దాటవచ్చు. మనస్సుకి ఎక్కించుకుంటే వేదన మిగులుతుంది. ఆ కాస్త ఇబ్బందిని అయినా ఎందుకు భరించాలి? అనే సందేహం వస్తుంది. కానీ మనం ఆ పరిస్థితిని మార్చలేము కదా! అప్పుడు కూడా అంతా మన మంచికే అనుకుంటే అద్భుతం జరుగుతుంది. దీని వల్ల మంచే జరుగుతుంది అనే సానుకూల భావన వల్ల మన మనసు సానుకూల భావతరంగాలను ప్రసరింప చేస్తుంది. భావతరంగాలు పరిసరాలని, పరిస్థితులని, వ్యక్తులని కూడా ప్రభావితం చేస్తాయి. దానివల్ల ముందుగా వాతావరణం, తరువాత మనస్సు ప్రశాంత మవుతాయి. పరిస్థితులు చక్కబడతాయి. దానికి కారణం నెమ్మదించిన మనస్సు. ఆధ్యాత్మిక గ్రంథాలు మాత్రమే కాదు, ఎఖార్ట్ వంటి ఆధునిక మనస్తత్వశాస్త్రవేత్తలు కూడా ఆలోచనని అనుసరించే పరిస్థితులు ఉంటాయి అని ప్రయోగాత్మకంగా నిరూపించారు. వేలికి దెబ్బ తగిలింది అని బాధపడటం కన్న చెయ్యి, కాలూ బాగున్నందుకు సంతోషించటం నేర్చుకోవాలి. సరైన చెప్పులు లేవని ఏడుస్తున్న కొడుకుకి కాళ్ళు లేని వాడిని చూపించాడుట తండ్రి. అప్పుడు లోటు ఉన్నా బాధ పడటం ఉండదు. సంతోషమే ఉంటుంది. సంతోషంగా ఉంటే 'హేపీ హార్మోనులు' విడుదల అవుతాయి. సంతోషం, ఆనందం బాహ్యమైన వస్తువులు, పరిస్థితుల పైన కాక దృక్పథం మీద ఆధార పడి ఉంటాయి. పురిటి నొప్పులు పడనిదే శిశువు లోకంలో అడుగు పెట్టటం కుదరదు. బిడ్డ చిరునవ్వు చూడగానే నొప్పుల సంగతి మరపుకి వస్తుంది. సాన పెట్టనిదే వజ్రం మెరవదు. నమలనిదే పదార్థం రుచి తెలియదు. గంధపుచెక్కని అరగదీయనిదే మంచిగంధం రాదు. చివరికి కుంకుడుకాయ రసం కావాలి అన్నా గట్టిగా పిసకాలి. ఇతర పళ్ల రసం గురించి చెప్ప నక్కర లేదు. గట్టిగా పిండనిదే రసం రాదు. ఈ కష్టం మెఱుగుదల కోసమే అని అర్థం చేసుకుంటే సమస్య లేదు. దానిని కూడా వ్యాయామం మొదలైనవి చేసినప్పుడు సుఖం లాగా ఆనందించవచ్చు.

# విదేశాల్లో ప్రభాకర్‌రావు, శ్రావణ్

## ట్యాపింగ్ కేసులో నాంపల్లి కోర్టులో సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు

## భుజంగరావు, తిరుపతన్న బెయిల్ పిటిషన్లపై తీర్పు నేటికి వాయిదా




హైదరాబాద్: స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కార్యాలయం కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పంజగుట్ట పోలీసులు మంగళవారం అభియోగపత్రాలు దాఖలు చేశారు. ఇప్పటికే అరెస్టయిన పోలీసు అధికారులు దుగ్యాల ప్రణీత్‌రావు, నాయిని భుజంగరావు, మేకల తిరుపతన్న, మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావులతోపాటు పరారీలో ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు, శ్రావణ్ రావులను నిందితులుగా పేర్కొంటూ అభియోగాలు మోపారు. పరారీలో ఉన్న ఇద్దరూ విదేశాల్లో తలదాచుకున్నట్లు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ ఏడాది మార్చి 10న పంజగుట్ట పోలీసుస్టేషన్‌లో కుట్ర, నమ్మకద్రోహం, నేరపూరిత చర్యలు, ప్రజా ఆస్తుల విధ్వంసం తదితర సెక్షన్ల కింద నమోదైన ఈ కేసు ఆపై ట్యాపింగ్ టర్న్ తీసుకుంది. దీంతో టెలిగ్రాఫ్ యాక్ట్, సైబర్ టెర్రరిజం చట్టాలను జోడించారు. నిందితుడిగా ఉన్న ప్రణీత్‌ను మార్చి 12న, భుజంగరావును తిరుపతన్నలను 23న, రాధాకిషన్‌రావును 28న అరెస్టు చేశారు. చట్ట ప్రకారం ఓ నిందితుడిని అరెస్టు చేసిన తర్వాత గరిష్ఠంగా 90 రోజుల్లో అతడిపై అభియోగపత్రం దాఖలు చేయకుంటే న్యాయస్థానం అతడికి మ్యాండేటరీ బెయిల్ మంజూరు చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే పోలీసులు మంగళవారం ఈ కేసులో సప్లిమెంటరీ చార్జ్‌షీట్ దాఖలు చేశారు.

### ట్యాపింగ్... వసూళ్లు

ట్యాపింగ్ కేసు దర్యాప్తులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేరు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు కోర్టుకు తెలిపారు. కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబీకులు, సంబంధీకులు, పోలీసు అధికారులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, జర్నలిస్టుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. బీఆర్ఎస్‌కు చెందిన అసమ్మతి నేతలపైనా అక్రమ నిఘా ఉంచినట్లు వివరించారు. అలాగే, బీజేపీ నేతలు ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, బండి సంజయ్‌ల ఫోన్లు ట్యాప్ చేశారని అభియోగపత్రాల్లో పేర్కొన్నారు. వివిధ నిర్మాణ సంస్థలు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు చెందిన యజమానులు, వ్యాపారవేత్తల ఫోన్ల పైనా అక్రమ నిఘా ఉంచారని, అలా తెలుసుకున్న విషయాలతో వసూళ్లకు పాల్పడ్డారని పోలీసులు గుర్తించారు. బీఆర్ఎస్ అగ్రనాయకుల ఆదేశాల మేరకు రాధాకిషన్‌రావు భారీ స్థాయిలో వసూళ్లకు పాల్పడినట్లు తేల్చారు. మొత్తమ్మీద నిందితులు 1000 నుంచి 1200 ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఆధారాలు లభించాయని, బాధితుల్లో హైకోర్టు న్యాయమూర్తి కాజా శరత్ కూడా ఉన్నట్లు అధికారులు న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. మరోపక్క డీఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై తీర్పును కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే అరెస్టులు జరిగాయని నిందితుల తరఫు న్యాయవాది, బెయిల్ ఇస్తే దర్యాప్తును ప్రభావితం చేస్తారని ప్రభుత్వ న్యాయవాది వాదించారు.

# కొల్లగొట్టిన సొమ్ము ఏం చేశారు



హైదరాబాద్: గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంలో ప్రాథమిక ఆధారాల మేరకు రూ.700 కోట్ల మేరకు నిధులు దారి మళ్లించినట్టు ఏసీబీ గుర్తించింది. ఇలా కొల్లగొట్టిన కోట్లాది రూపాయల సొమ్మును ఏం చేశారు..? ఈ కుంభకోణంలో ఇంకా ఎవరెవరు ఉన్నారు..? మీరే ఈ కుంభకోణానికి తెరతీశారా..? లేదా మీపై ఇంకెవరైనా ఒత్తిడి పెట్టారా...? అంటూ ఏసీబీ అధికారులు రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ మాజీ ఎండీ సబావత్ రాంచందర్, అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దగ్గర ఓఎస్డీగా పనిచేసిన గుండమరాజు కల్యాణ్‌కుమార్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. కోర్టు అనుమతితో మూడు రోజుల కస్టడీలో భాగంగా అధికారులు ఇద్దరిని మంగళవారం రెండోరోజూ ప్రశ్నించారు. మొదటి రోజు ఇద్దరి నుంచి వేర్వేరుగా సేకరించిన అంశాలపైనా రెండో రోజు మార్చిమార్చి ప్రశ్నలు అడిగినట్టు తెలిసింది. ప్రైవేటు వ్యక్తులను గొర్రెల కొనుగోళ్లలోకి ఎలా తెచ్చారు.. ఇందుకు సంబంధించి ఆయా జిల్లాల అధికారులకు ఆదేశాలు ఇవ్వడం వెనుక ఎవరి ఒత్తిడైనా ఉందా..? అని ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ ఇద్దరూ కలిసే ఈ మొత్తం కుంభకోణానికి తెరతీశారా..? ఇంకా ఎవరైనా ఆదేశాలిచ్చారా.. అన్న కోణంలోనూ ప్రశ్నించినట్టు తెలిసింది. బినామీల పేర్లతో చెక్కులు జారీ చేయించిన తర్వాత కొల్లగొట్టిన సొమ్మును అనుకూలుర బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించారన్న దానిపైనా అధికారులు సమాచారం సేకరించినట్టు తెలిసింది. బినామీ బ్యాంకు ఖాతాలు, పరారీలో ఉన్న నిందితుల గురించి కూడా ప్రశ్నించినట్టు తెలిసింది. అధికారులు అడిగిన చాలా ప్రశ్నలకు రాంచందర్, క ల్యాణ్‌కుమార్ సమాధానాలు దాట వేసినట్టు సమాచారం. విచారణలో వారి నుంచి ఆశించిన సమాచారం రాలేదని, బుధవారం కస్టడీ చివరిరోజు కావడంతో కీలక సమాచారం రాబట్టేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

రాంచందర్ సస్పెన్షన్

అవినీతి ఆరోపణలపై ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ సీఈఓ, రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ మాజీ ఎండీ సబావత్ రాంచందర్‌పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. మే 31న ఏసీబీ రాంచందర్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దీంతో రాంచందర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదర్ సిన్హా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## మహారాష్ట్రలో వర్ష బీభత్సం.. 14 మంది మృతి



మహారాష్ట్రలోని మరత్వాడా ప్రాంతంలో వర్షం బీభత్సం సృష్టించింది. జూన్ 1 నుంచి ప్రారంభమైన వర్షాల ప్రభావంతో.. ఇప్పటి వరకు 14 మంది చనిపోయారు. ఇందులో పిడుగుపాటు కారణంగా 11 మంది మృతి చెందారు. డివిజనల్ కమిషనర్ కార్యాలయం రూపొందించిన ప్రాథమిక సర్వే నివేదిక ప్రకారం.. గత రెండు రోజుల్లో పర్భానీ, హింగోలి జిల్లాల్లో నాలుగు మరణాలు నమోదయ్యాయి. జూన్ 1 నుంచి మరత్వాడాలోని ఏడు జిల్లాల్లో వర్షాల కారణంగా 14 మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో నాలుగు మరణాలు గత రెండు రోజుల్లోనే సంభవించాయి. నలుగురు బాధితుల్లో ఇద్దరు 14 ఏళ్ల బాలుడు, 40 ఏళ్ల మహిళ ఉన్నారు. వరద నీటిలో కొట్టుకుపోయి ఇద్దరు మృతి చెందగా, ఆవుల కొట్టం కూలి ఒకరు మృతి చెందారు. మరాఠ్వాడాలోని మొత్తం ఎనిమిది జిల్లాల్లో ఏడింటిలో ఈ మరణాలు సంభవించాయి. సర్వే నివేదిక ప్రకారం, లాతూర్ జిల్లాలో అత్యధికంగా నాలుగు మరణాలు సంభవించగా, పర్భానీ మరియు నాందేడ్ ఒక్కొక్కటి మూడు మరణాలు నమోదయ్యాయి. మరో నాలుగు జిల్లాలు.. జల్నా, హింగోలి, బీడ్ మరియు ధరాశివ్ ఒక్కొక్కరు మరణించారు. జూన్ 1 నుంచి మరాఠ్వాడాలోని మొత్తం ఎనిమిది జిల్లాల్లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా మనుషులే కాకుండా 251 జంతువులు కూడా ప్రాణాలు కోల్పోయాయి. గత రెండు రోజుల్లో 99 జంతువులు చనిపోయాయి. భారీ వర్షాల కారణంగా జూన్ 12న రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎల్లో అలర్ట్, ఆరెంజ్ అలర్ట్‌లను వాతావరణ శాఖ ప్రకటించింది. మరోవైపు.. బీడ్ జిల్లాలో గత రెండు రోజుల నుంచి వర్షం కురుస్తూనే ఉంది. దీంతో.. మజల్‌గావ్ తాలూకాలోని కోతల గ్రామంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి నదికి వరద పోటెత్తింది. లాతూర్ జిల్లాలోని నెల్వాడ్ గ్రామంలో వ్యవసాయం భూమి, రోడ్లు జలమయమయ్యాయి. గ్రామం నుంచి బయటకు వెళ్లే రహదారిపై నుంచి నీరు ప్రవహించడంతో గ్రామస్తులు బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ భూమిలోకి నీరు చేరడంతో మట్టి కొట్టుకుపోయింది. వాగులు పొంగి పొర్లడంతో రహదారులు మూసుకుపోయాయి.ద

## వారణాసిలో మోదీ ఓటమి నుంచి తప్పించుకున్నారు



తిరువనంతపురం: ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ పోటీ చేసిన వారణాసిలో ఆయన ఓటమి నుంచి తప్పించుకున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కేరళలోని మలప్పురంలో ఓ సమావేశంలో రాహుల్ గాంధీ పాల్గొని ప్రసంగించారు. అయోధ్య ప్రజల చేతిలో భాజపా ఓడినట్లే వారణాసిలో మోదీ ఓడిపోయి ఉండేవారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి కావాల్సిన సీట్లు భాజపా ఒంటరిగా సాధించకపోవడానికి మోదీ నైతిక బాధ్యత వహించాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు రాజ్యాంగాన్ని మారుస్తామని భాజపా నేతలు మాట్లాడారని, కానీ అదే రాజ్యాంగానికి ప్రమాణస్వీకారం వేళ మోదీ దండం పెట్టుకున్నారని వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు వారికి ఏం కావాలో ప్రధానికి స్పష్టంగా తెలిసేలా చేశారన్నారు. మోదీ వారణాసిలో కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ రాయ్ పై 1,50,000 ఓట్లకు పైగా మెజార్టీతో విజయం సాధించారు. అయోధ్యలో సమాజ్ వాదీ పార్టీకి చెందిన అవదేశ్ ప్రసాద్ భాజపా అభ్యర్థి లల్లూ సింగ్‌పై విజయం సాధించారు. భాజపా కంచుకోట అయిన ఉత్తరప్రదేశ్‌లో ఆరు స్థానాలతో సహా మొత్తం 99 స్థానాలను ఇండియా గెలుచుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా 240 సీట్లలో విజయం సాధించినా, ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి మరో 32 సీట్లు కావాల్సి రావడంతో చంద్రబాబునాయుడు(టీడీపీ), నీతీశ్‌కుమార్ (జేడీయూ) సహాయం తీసుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది.

## కువైట్ మృతుల కుటుంబాలకు మోడీ సంతాపం



కువైట్ అగ్నిప్రమాదంలో మరణించిన కుటుంబాలకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. "కువైట్ నగరంలో జరిగిన అగ్నిప్రమాదం బాధాకరం. నా ఆలోచనలు తమ సన్నిహితులను, ప్రియమైన వారిని కోల్పోయిన వారందరిపై ఉన్నాయి. క్షతగాత్రులు కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది. బాధితులకు సహాయం చేయడానికి అక్కడి అధికారులతో కలిసి పని చేస్తోంది" అని మోడీ చెప్పారు. కువైట్ భవనంలో జరిగిన అగ్నిప్రమాదంలో 41 మంది భారతీయులు సజీవ దహనం అయ్యారు. పలువురు భారతీయులు గాయపడ్డారు. ఆరు అంతస్తుల భవనంలోని వంటగదిలో మంటలు ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. భవనంలో దాదాపు 160 మంది నివసిస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటలకు ఈ ఘటన జరిగింది. 43 మంది ఆసుపత్రి పాలయ్యారని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. భవనంలో కంపెనీకి చెందిన కార్మికులు ఉన్నారని అధికారులు తెలిపారు. మంటల నుంచి తప్పించుకునేందుకు కొందరు భవనం ఐదో అంతస్తు నుంచి దూకి చనిపోయారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

## టీడీపీ కార్యకర్తలా.. గూండాలా.. ఇదేం అరాచకం

### ఏపీలో టీడీపీ దాడులపై రాష్ట్రపతికి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు



న్యూఢిల్లీ: ఏపీలో జరుగుతున్న టీడీపీ దాడులపై రాష్ట్రపతికి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేసింది. అనంతరం ఆ పార్టీ నేతలు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏపీలో శాంతి భద్రతలను పరిరక్షించాలని రాష్ట్రపతిని కోరినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు. ఏపీలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. వారం రోజులుగా టీడీపీ శ్రేణులు దాడులకు తెగబడుతున్నాయి. వక్రీకరించే బుద్ధి చంద్రబాబు, ఆయన పార్టీ నాయకులకే ఉంది" అంటూ విజయసాయిరెడ్డి మండిపడ్డారు. "చట్టం లేదు, సేచ్ఛ లేదు, న్యాయం లేదు. అన్యాయమే రాజ్యమేలుతోంది. బాధితులు ఫిర్యాదు చేస్తామన్నా పోలీసులు స్వీకరించే పరిస్థితి లేదు. ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి. వెళ్లాయి.. కానీ ఎలాంటి పరిస్థితి ఎన్నడూ లేదు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, వాళ్ల ఆస్తులే లక్ష్యంగా చేసుకుని టీడీపీ శ్రేణులు స్వైర విహారం చేస్తున్నాయి. మీరు టీడీపీ కార్యకర్తలా.. గూండాలా?. ప్రమాణస్వీకారానికి ముందే చంద్రబాబు హింసను ప్రేరేపించారు. హింసకు గురైన బాధితులు ఆక్రందనలు చంద్రబాబుకు కనిపించడం లేదా?" అని విజయసాయిరెడ్డి మండిపడ్డారు. "ఇది చీకటి అధ్యాయంగా చరిత్రలో మిగిలిపోతుంది. టీడీపీ దాడులు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయి. టీడీపీకి వ్యతిరేకంగా ఉన్నవాళ్లపై దాడి చేసి, సోషల్ మీడియాలో వీడియోలు పెడుతున్నారు. మంగళగిరిలో లోకేష్ మనుషులు సోషల్ మీడియా కార్యకర్తల పట్ల అమానుషంగా ప్రవర్తించారు. బంగారం లాంటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని టీడీపీ తగలబెడుతోంది. ఈ హింస ఇలాగే కొనసాగితే బీజేపీ కూడా బాధ్యత వహించాల్సి వస్తుంది. ఇలా దాడులు చేయడం మంచి సంప్రదాయం కాదు. చివరకు మీడియా స్వేచ్ఛను కూడా అణచివేస్తున్నారు. ఏపీలో రాజ్యాంగం కుప్పకూలిపోయింది."అని విజయసాయి ధ్వజమెత్తారు.

# పిల్లల భవితకు పరీక్షా




పరీక్షల్లో విద్యార్థులు పాసవడం, ఫెయిలవడం సహజం. కానీ వ్యవస్థే ఫెయిలవడం, తత్కారణంగా విద్యార్థులు గురి తప్పడం ఎప్పుడన్నా చూస్తామా? వైద్య విద్యాలయాల్లో ప్రవేశానికై జరిపే అఖిల భారత పరీక్ష నేషనల్ ఎలిజబిలిటీ- కమ్- ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) విషయంలో అదే జరిగింది. పేపర్ లీకులు, గ్రేస్ మార్కులు, పలువురికి నూరుశాతం మార్కులు, కటాఫ్ మార్కుల్లో గణనీయంగా పెరుగుదల... ఇలా ఈ ఏటి 'నీట్' పరీక్షలో వివాదాలు అనేకం. ఈ అవకతవకలన్నీ విద్యార్థుల్లో ఆవేదన, ఆందోళన, నిరాశ రేపుతున్నాయి. ఈసారి పరీక్ష జరిగిన కంగాళీ వ్యవహారంపై కోచింగ్ సంస్థలు, డాక్టర్లు, ప్రతిపక్ష నేతలు గొంతెత్తేలా చేశాయి. చివరకిలాంటి దేశవ్యాప్త పరీక్షలు నిర్వహించే జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ)పై పిల్లలకూ, తల్లితండ్రులకూ నమ్మకమే పోయే పరిస్థితి వచ్చింది. కొన్నిచోట్ల పేపర్ లీకైందన్న వార్తల్ని ఎన్టీఏ కొట్టిపారేసినా, విద్యార్థులు, కోచింగ్ సంస్థల వారు కోర్టు కెక్కారు. ఫలితాలను రద్దు చేయాలన్న వారి పిటిషన్‌పై కేంద్రానికీ, ఎన్టీఏకీ సుప్రీం కోర్ట్ మంగళవారం నోటీసులు జారీ చేసింది. పరీక్ష పవిత్రతే దెబ్బతిన్నదంటూ జవాబు కోరింది. వెరసి కొన్నేళ్ళు గా రచ్చ రేపుతున్న ఈ మెడికల్ ఎంట్రన్స్ ఎగ్జామ్ విశ్వసనీయతకు ఇప్పుడు అగ్నిపరీక్ష ఎదురైంది. దేశంలోని 700 పైచిలుకు విద్యాలయాల్లో లక్షా 8 వేల చిల్లర ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఎంబీబీఎస్ చదివేందుకు ఏటా కొన్ని లక్షల మంది 'నీట్'కు హాజరవుతారు. 2017లో 12 లక్షల మంది హాజరుకాగా, ఏడేళ్ళలో ఆ సంఖ్య రెట్టింపైంది. ఈ ఏడాది 'నీట్'కు 24 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. మే 5న పరీక్ష జరగగా, తర్వాత నెలరోజులకే, నిర్ణయించిన తేదీ కన్నా పది రోజుల ముందరే జూన్ 4న ఫలితాలను ప్రకటించారు. దేశమంతా ఎన్నికల ఫలితాల హడావిడిలో ఉండగా సందట్లో సడేమియాగా ఈ ఫలితాల వెల్లడి అనుమానాలు రేపింది. పైగా, ఏటా ఈ ప్రవేశపరీక్షలో ఏ ఒక్కరో నూరు శాతం మార్కులు సాధిస్తారు. ఆ మాటకొస్తే, అసలీ పరీక్షలో 650, ఆ పైన మార్కులు సంపాదించడం సైతం కష్టం. కఠోరసాధనతోనే సాధ్యం. అలాంటిది... ఈసారి ఏకంగా 67 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు వచ్చాయి. ఫలితంగా... గతంలో 650 మార్కుల స్కోరుకు సైతం విద్యార్థులకు పదివేలల్లో ర్యాంకులొస్తే, ఈసారి ఆ మార్కులకు ముప్పై, నలభై వేల మధ్య ర్యాంకులే దక్కడంతో విద్యార్థులు, తల్లితండ్రుల ఆవేదన అంతా ఇంతా కాదు. ఆన్‌లైన్ పరీక్ష 'క్లాట్'కూ, ఆఫ్‌లైన్‌లో జరిగే 'నీట్'కూ విధానాల్లో తేడాలున్నాయి. కానీ, క్లాట్‌లో లాగా ఇక్కడా 1563 మంది విద్యార్థులకు ఎన్టీఏ గ్రేస్ మార్కులు కలిపింది. అదేమంటే కొన్నిచోట్ల ప్రశ్నపత్రాలు ఆలస్యంగా ఇవ్వడం వల్ల విద్యార్థులకు సమయం వృథా అయిందనీ, వారు చదివిన పాత - కొత్త పాఠ్యపుస్తకాల్లో తేడాలున్నాయనీ, అందుకే అదనపు మార్కులు కలిపామనీ చెప్పింది. కాంపిటీటివ్ పరీక్షల్లో కనీవినీ ఎరుగని గ్రేస్ మార్కులు, ఈ వివరణలు హాస్యాస్పదం. పైగా, సరైన జవాబుకు 4 మార్కులు - తప్పితే ఒక మార్కు మైనస్ గనక, ఏ లెక్కన చూసినా అసంభవమైన 717, 718 లాంటి స్కోర్లు రావడమేమిటో దేవుడికే తెలియాలి. పాట్నాలో పేపర్ లీకైందనీ, రాజస్థాన్, జార?ండ్, ఢిల్లీ, గుజరాత్‌లలో ఒకరి బదులు మరొకరు పరీక్షలు రాశారనీ ఫిర్యాదులున్నాయి. హర్యానాలో ఒకే సెంటర్‌లో పరీక్ష రాసిన ఆరుగురికి ఫస్ట్ ర్యాంక్ రావడం, పైగా వారి దరఖాస్తులు ఆరోహణ క్రమంలో ఒకరి తర్వాత మరొకరివి కావడం విడ్డూరం. నీట్‌లో 715 మార్కులొచ్చిన విద్యార్థి తీరా ఇంటరే పాసవని విచిత్రం సరేసరి. అందుకే, అసలు నిజాలను ఎన్టీఏ దాచిపెడుతోందని అనుమానాలొస్తున్నాయి. లీకులు, వివాదాలు కొత్త కాకున్నా ఈసారి జరిగింది పక్కా స్కామ్ అంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరీక్ష రద్దు చేసి, మళ్ళీ జరపాలనే డిమాండ్లూ వస్తున్నాయి. ఇప్పుడు నీట్‌లో మంచి మార్కులొచ్చి కూడా ఎప్పటిలా మంచి ర్యాంక్, కోరుకున్న కాలేజీలో సీటు రాని విచిత్రపరిస్థితి విద్యార్థులది. నిస్పృహతో కొందరు పిల్లలు ఇప్పటికే ఆత్మహత్యలకు పాల్పడడం విషాదం. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. పేదలకూ, సామాజిక న్యాయానికీ ఈ నీట్ నిర్వహణ పూర్తిగా వ్యతిరేకమని తమిళనాడు ఎప్పటి నుంచో వాదిస్తోంది. 2021లో వచ్చిన స్టాలిన్ సర్కార్ జస్టిస్ రాజన్ సారథ్యంలో ఉన్నత స్థాయి కమిటీ వేసింది. కమిటీ సిఫార్సుల మేరకు లోపభూయిష్ఠమైన నీట్ నుంచి తమ రాష్ట్రాన్ని మినహాయించాలంటూ, అసెంబ్లీలో బిల్లు పాస్ చేసింది. దీర్ఘకాలంగా రాష్ట్రపతి ముద్ర కోసం వేచి చూస్తోంది. ఎన్టీఏ మాత్రం తప్పులు ఒప్పుకొని, దిద్దుబాటుకు సిద్ధం కావట్లేదు. తాజా పరీక్షలో జవాబులు గుర్తుపెట్టే ఓఎంఆర్ షీట్ చినిగిపోయిందంటూ ఎన్టీఏ ఒకరి ఫలితం ఆపేసింది. తీరా చూస్తే ఆ విద్యార్థినికి 715 మార్కులు రావడం గమనార్హం. ఇలాంటి విచిత్ర విన్యాసాలు చూశాకనైనా... మన పరీక్షా వ్యవస్థలో, ఉపయోగించే సాంకేతికతలో పారదర్శకత తీసుకురాక తప్పదు. అవసరమైతే వైద్య విద్యాలయాల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను వాయిదా వేసి, కూలంకషంగా దర్యాప్తు చేయాలి. అవకతవకలు జరిగాయంటూ వస్తున్న ఆరోపణలను పరిశీలిస్తున్న ఉన్నతస్థాయి ప్యానెల్ మరో వారంలో తన నివేదిక ఇవ్వనుంది. అది చేసే సిఫార్సుల మాట అటుంచితే, ఇంత జరుగుతున్నా ప్రభుత్వ పెద్దలు ఈ వివాదంపై ఇప్పటి దాకా నోరు విప్పకపోవడం విషాదం. చదువుల నుంచి ఉద్యోగాల దాకా మన దేశంలో సమస్త పరీక్షలకూ లీకుల జాడ్యం, అవకతవకల మకిలి అంటుకుంది. గత అయిదేళ్ళలో 15 రాష్ట్రాల్లో మొత్తం 41 పేపర్ లీకుల వల్ల 1.4 కోట్ల మంది ఉద్యోగార్థులకు కష్టం, నష్టం కలిగాయి. ఇది మన వ్యవస్థకే సిగ్గుచేటు. బాగా చదువుకోవాలనుకున్న పసివారి భవిష్యత్తుకు సైతం ఈ పీడ తప్పకపోవడమే మరీ బాధాకరం. సమూల ప్రక్షాళనతో ఇలాంటి పరీక్షలను లోపరహితంగా మార్చడమే మార్గం.

# రాష్ట్రాన్ని గ్లోబల్ ఎకానమీలో నిలిపిన నిపుణుడు

విశ్వసనీయత, అంకితభావంతో పాటు దార్శనికత కలిగిన నాయకులు ప్రజా జీవన ప్రమాణాలలో పరివర్తన తీసుకురాగలుగుతారు కానీ వర్తమాన భారతవనిలో ఈ తరహా నాయకులు అరుదు. స్థానికాంశాలలో మాత్రమే నిమగ్నమై ఉండే రాష్ట్ర స్థాయి నాయకులే తప్ప దూరదృష్టితో, అంతర్జాతీయ దృక్పథంతో, విదేశాల సౌజన్యంతో తమ రాష్ట్రాల అభివృద్ధి గూర్చి అలోచించేవారు బహు అరుదు. నెహ్రూ హయాం నుండి ఇప్పటి వరకు విదేశాంగ విధానం అనేది పూర్తిగా కేంద్ర అంశం, అందులో రాష్ట్రాల ప్రమేయం ఉండదు. విదేశీ పర్యటనలు, ప్రముఖులతో సమావేశాలు, పెట్టుబడులు వగైరా అన్నీ విదేశాంగ మంత్రిత్వ శాఖే నిర్ణయిస్తుంది. కానీ దీనికి మినహాయింపుగా స్వాతంత్ర్య భారతంలో ప్రప్రథమంగా నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనలతో, ప్రతినిధి బృందాలతో, పెట్టుబడులు తెస్తూ కొత్త ఒరవడిని నెలకొల్పారు. 1990లో శస్త్రచికిత్స కోసం 59 రోజులపాటు అమెరికాకు వెళ్ళిన అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ప్రపంచ బ్యాంకు నుంచి వరదల పునరవాస చర్యల కొరకు రూ.2800కోట్ల రుణాన్ని తీసుకురావడం గురించి, న్యూయార్క్ నుండి ఫాక్స్ ద్వారా జీవోలు జారీ చేయడాన్ని గురించి అప్పట్లో గొప్పగా చెప్పుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ తర్వాత, కొన్నాళ్ళకు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు దేశ విదేశాంగ విధాన తీరులో సమూల మార్పును తీసుకోవచ్చారు. అప్పటి వరకు రాష్ట్రాలతో సంబంధం లేకుండా నడిచిన విదేశాంగ విధానంలో రాష్ట్రాలకు కూడా పాత్ర ఉండాలంటూ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన వాదనకు జాతి ప్రయోజనాల దృష్ట్యా అందరి నుంచి ఆమోదం లభించింది. ఇప్పుడు 25ఏళ్ళ తర్వాత ఆయన తనయుడు లోకేశ్ కూడా బలమైన రాష్ట్రాలు లేకుండా భారత వికాసం ఎలా అంటూ అడుగుతుండడం ముదావహం. చంద్రబాబు దార్శనికత గూర్చి ఇక్కడ ప్రస్తావించాలి. ఇప్పుడు అమెజాన్, ఫ్లిఫ్‌కార్ట్‌లు నిత్య జీవితంలో ఒక భాగమే, కానీ రెండు దశాబ్దాల క్రితం అనేక వర్ధమాన దేశాలలో సైతం ఈ-కామర్స్ గురించి పెద్దగా తెలియని కాలంలో చంద్రబాబు నాయుడు దుబాయిలో ఈ-కామర్స్ కేంద్రంగా పురుడుపోసుకుంటున్న ఇంటర్నెట్ సిటీని పర్యటిస్తానని ప్రత్యేకంగా ఆసక్తి చూపారు. అప్పట్లో దీనిపై ఇటు భారతీయ దౌత్యవేత్తలతో పాటు, అప్పటి దుబాయి యువరాజు, ప్రస్తుత రాజు అయిన షేక్ మోహమ్మద్ రాషేద్ అల్ మోఖ్తుం అశ్చర్యపోయారు. భవిష్యత్తు పట్ల ఇంత దార్శనికత కలిగిన




ఈ భారతీయ నాయకుడు ఎవరా అని అరబ్బులు ఆసక్తిగా గమనించారు. అప్పటికి ఇంకా బాలుడిగా ఉన్న నారా లోకేశ్‌తో కలిసి ఆయన దుబాయిలోని ఇంటర్నెట్ సిటీని పర్యటించి దాని తీరుతెన్నులను పరిశీలించి సైబరాబాద్‌లోని హైటెక్ టవర్ల నిర్మాణంలో దానికి అనుగుణంగా కొన్ని సూచనలు చేసారు. పెరుగుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో విమానయాన రాకపోకలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని గ్రహించిన చంద్రబాబు నాయుడు శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి శ్రీకారం చుట్టడమే గాక అందులో విమానాలను నడపడానికి ఎయిర్‌లైన్స్ చుట్టు తిరిగారు. సంప్రదాయకంగా ఇరుదేశాల మధ్య జనవరిలో జరిగే ద్వైపాక్షిక విమానాల రాకపోకల ఒప్పందాలకు భిన్నంగా చంద్రబాబు నాయుడు ఏమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌కు హైదరాబాద్‌లో ప్రత్యేక అనుమతి ఇప్పించారు. దాంతో 2001 జూలై 2న ప్రప్రథమ ఏమిరేట్స్ విమానం హైదరాబాద్‌లో దిగింది. అందులో దుబాయి నుంచి వచ్చిన ఏమిరేట్స్ ఎయిర్‌లైన్స్ అత్యున్నత అధికారి ఘయిత్ అల్ ఘయిత్ ఈ విమానం హైదరాబాద్‌కు రావడానికి కేవలం చంద్రబాబు నాయుడు కారణమని ప్రశంసించారు. ఈ విమానం ద్వారా దుబాయి మీదుగా అమెరికా, ఐరోపాలతో సహా ప్రపంచానికి హైదరాబాద్‌కు విమాన సౌకర్యం విరివిగా అందుబాటులో వచ్చింది. ఆ తర్వాత వ్యూహాత్మకంగా హైదరాబాద్‌లో అమెరికన్ సాఫ్ట్‌వేర్ దిగ్గజాలను ఆకర్షించిన చంద్రబాబు నగరంలో అమెరికా కాన్సులేటు నెలకొల్పడానికి నిర్విరామంగా చేసిన ప్రయత్నాలు చూసి సాక్షాత్తూ అమెరికా విదేశాంగ శాఖ సైతం నివ్వెరపోయింది. స్వాతంత్ర భారత చరిత్రలో అమెరికా ప్రప్రథమంగా నెలకొల్పిన కాన్సులేటు ఇదేనని అని చాలమందికి తెలియదు. దశాబ్దకాలంగా కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితమైన విదేశాంగ శాఖలోని 'లుక్ ఈస్ట్' విధానాన్ని చంద్రబాబు తన చేతల ద్వారా దేశానికి చూపించారు. చైనా, సింగపూర్, దక్షిణా కొరియాలతో వ్యూహాత్మక ఆర్థిక ప్రయోజనాలు సాధించారు 2014లో జపాన్‌లో ఎన్నికలలో నిమగ్నమై ఉన్న ప్రధాని షింజో అబే, విశ్వఖ్యాత ఎలక్ట్రానిక్స్ సంస్థ పానసోనిక్ యాజమాన్యంతో సమావేశమవడానికి సందర్శిస్తానని చంద్రబాబు విజ్ఞప్తి చేయడంతో దౌత్యవేత్తలు ఒకింత అశ్చర్యం వ్యక్తం చేసారు. కానీ అవతలి వైపు నుండి వచ్చిన సానుకూలతతో వారిద్దరితో చంద్రబాబు నాయుడు మాట్లాడిన తీరు జపాన్?లోని భారత రాయబారి దీపా వాధ్వాతో పాటు జపానీ పారిశ్రామికవేత్తలను అబ్బురపర్చింది. మైక్రోసాఫ్ట్ మొదలు కియా మోటర్స్ వరకు అనేక బహుళజాతి బ్రాండ్లను రాష్ట్రానికి తెచ్చిన తీరు దౌత్యవేత్తలకు సైతం మార్గదర్శకంగా నిలించింది. అదే విధంగా, సాధారణంగా రాష్ట్రాల స్థాయి నాయకులను కలవని యూఏఈ అధ్యక్షుడు, ఆబుధాబి రాజు శేఖ్ మోహమ్మద్ బిన్ జాయద్ కూడ 2018లో చంద్రబాబుతో సమావేశమై తాను నవ్యాంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెడుతానని చెప్పినా ఆ తర్వాత ప్రభుత్వ మార్పిడితో అడుగు ముందుకు పడలేదు. ఆర్థిక ప్రయోజనాలే కాకుండ సగటు ప్రవాసీయుల సమస్యలపై కూడా ఆయన స్పందించారు. గల్ఫ్‌లో మృతదేహాల పెండింగ్ గూర్చి ఈ ప్రతినిధి 1995లో వ్రాసిన ఒక వ్యాసంపై అప్పుడే అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు స్పందించిన తీరు సౌత్ బ్లాక్‌లో కదలిక తీసుకువచ్చింది. ఈ రకమైన దార్శనికత, అంకితభావం కలిగిన చంద్రబాబు నాయుడి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ మళ్ళీ అభివృద్ధిబాటపై పయనిస్తుందని ఆశించవచ్చు.

# హిందూత్వ-కార్పొరేట్ దిశ



నరేంద్ర మోడీ నేతృత్వాన కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వం ఆదివారం అట్టహాసంగా కొలువుదీరింది. మొత్తం 71 మందితో ప్రధాని మోడీ తన కొత్త మంత్రి మండలిని నియమించగా, 30 మందికి కేబినెట్, ఐదుగురికి స్వతంత్ర, 36 మందికి సహాయ మంత్రి హోదా కల్పించారు. యువత, అనుభవజ్ఞ నేతల కలబోతగా మోడీ స్వీయ భుజకీర్తులు తగిలించుకున్నప్పటికీ, ఆర్‌ఎస్‌ఎస్, విహెచ్‌పి, పరివార్‌లకు చెందిన కీలక వ్యక్తులకే ప్రాధాన్యతనిచ్చారని ప్రమాణస్వీకారం చేసిన మంత్రుల జాబితాను చూస్తే అర్థమైపోతుంది. కేబినెట్‌లోకి తీసుకున్న రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, నితిన్ గడ్కరీ, జెపి నడ్డా, శివరాజ్‌సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, జైశంకర్, మనోహర్‌లాల్ ఖట్టర్ తదితరులందరూ సంఘ్ నాయకులే. గత రెండు పర్యాయాలకు భిన్నంగా ఈమారు బిజెపికి సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సరిపడా మెజార్టీ కోల్పోయింది. ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీలతో కలిసి మూడవ తడవ సంకీర్ణ సర్కారును ఏర్పాటు చేసింది. అయినప్పటికీ తన హిందూత్వ ఎజెండా అమలును వీడకుండా మంత్రి మండలిలో సంఘ్ పరివార్ నేతలను చొప్పించడం సాహసమే! తద్వారా తమ అసలు సిసలు లక్ష్యం నుంచి పక్కకు పోలేదని స్పష్టమైన సంకేతమే ఇచ్చింది. మోడీ ప్రభుత్వాన్ని '3.0' అని బిజెపి హోరెత్తిస్తుండగా, నియమించిన 71 మంది మంత్రుల్లో ఒక్కరు కూడా ముస్లిం మైనార్టీ లేరు. ఆ సామాజిక తరగతికి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులెవరూ బిజెపికి లేరని తప్పించుకోడానికి కుదరదు. రెండు సభల్లో సభ్యత్వం లేకుండానే పంజాబ్‌కు చెందిన రవనీత్‌సింగ్ బిట్టు, కేరళకు చెందిన జార్జి కురియన్‌లను మంత్రులను చేశారు మోడీ. కేరళలో ఎల్‌డిఎఫ్, పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వాలున్నందున, అక్కడ రాజకీయ లబ్ధిని ఆశించి ఎం.పి.లు లేకపోయినా ఆ కేబినెట్‌లోకి తీసుకున్నారు. దీన్నిబట్టి చూస్తే కావాలనే ముస్లింలకు మంత్రి మండలిలో చోటు కల్పించలేదని అర్థమవుతుంది. మహిళలు ఏడుగురికే అవకాశమిచ్చారు. మోడీ టీంలోకి ఏడుగురు ఎస్‌సిలను, ముగ్గురు ఎస్‌టిలను మాత్రమే తీసుకున్నారు. ఇదీ 'అత్యద్భుత' 3.0 మోడీ కేబినెట్‌లో అమలు జరిపిన సామాజిక న్యాయం. మోడీ పీఠానికి ఉన్న నాలుగు కాళ్లల్లో ఒకటి టిడిపి, కాగా రెండవది జెడియు. చంద్రబాబు, నితీష్ కుమార్ పార్టీలు లేకపోతే మోడీ సర్కారు లేదు. వీరిద్దరూ మహిళాభ్యున్నతికి, సామాజిక న్యాయానికి, ముస్లింల రక్షణకు కట్టుబడి ఉన్నామంటారు. మోడీ కేబినెట్‌లో మహిళలకు, ఎస్‌సి, ఎస్‌టిలకు సరైన ప్రాతినిధ్యం కల్పించకపోయినా, ఒక్క ముస్లింనూ మంత్రిని చేయకపోయినా ఎందుకు గమ్మునున్నారో తెలీదు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, బిజెపి, మోడీ తమ భాగస్వామ్య పక్షాలను అదుపులోనే ఉంచారని మంత్రుల ఎంపికను చూస్తే అవగతమవుతుంది. ఎ.పి.లో 16 ఎం.పి. స్థానాలను గెలిచిన టిడిపికి ఒక కేబినెట్, ఒక సహాయ మంత్రితో సరిపెట్టారు. జెడియుకు సైతం అంతే. ఒకటి రెండు సీట్లున్న పార్టీలకూ అదే మోతాదులో మంత్రి పదవులిచ్చారు. కేరళలో ఒకే ఒక్క సీటును బిజెపి గెలవగా ఆ ఒక్కరికీ మంత్రి పదవి కట్టబెట్టారు. ఒక్క సీటూ గెలవకపోయినా తమిళనాడు నుంచి ఇద్దరిని మంత్రులను చేశారు. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే తెలంగాణకు ఇచ్చిన ఇద్దరు మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజరు నేపథ్యం సంఘ్‌తోనే ముడిపడి ఉంది. ఎ.పి.లో బిజెపి మూడు స్థానాలు గెలవగా మంత్రి పదవి వచ్చిన భూపతిరాజు శ్రీనివాస వర్మది విహెచ్‌పి, ఎబివిపి బడే. సంఘ్ మూలాలు లేనందునే పురందేశ్వరి, సిఎం రమేష్‌లకు, తెలంగాణలో భారీ మెజార్టీతో గెలిచినప్పటికీ ఈటల రాజేందర్‌కు ఛాన్స్ ఇవ్వలేదని అర్థమవుతుంది. పట్టాభిషేక మహోత్సవంగా జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమానికి కార్పొరేట్ దిగ్గజాలైన ముఖేష్ అంబానీ, అనంత్ అంబానీ, గౌతం అదానీ, ఆనంద్ పిరమాళ్ వంటి వారు స్వయంగా హాజరయ్యారు. సంఘ్ నేతలతో మోడీ కేబినెట్, ఆ బృందానికి కార్పొరేట్ల సంపూర్ణ ఆశీర్వచనాలను చూస్తుంటే తిరిగి హిందూత్వ-కార్పొరేట్ పాలనే కొనసాగుతుందని అర్థమవుతోంది. యావత్ ప్రతిపక్షం, ప్రజలు అప్రమత్తమై సమర్ధవంతంగా ఎదుర్కోవాల్సి ఉంది.